క్రైమ్ మిర్రర్®

Voice of Anti Corruption

హైదరాబాద్

11-11-2026

వెల: రూ.5/-

పేజీలు: 10+10

సంపుటి:16

సంచిక:232

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



రేవంత్ బహుముఖ వ్యూహం!

ఎన్నికలు దగ్గర పడుతుండడంతో ప్రజల్లోకి వెళ్లేందుకు నిర్ణయం

సంక్రాంతి తర్వాత ప్రజాబలం పేరుతో భారీ కార్యక్రమం

గులాబీ పార్టీయే అసలు లక్ష్యం

తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నాయి. అక్కడకు పది నెలల వ్యవధిలోనే సార్వత్రిక ఎన్నికలు రానున్నాయి. ఆ రెండు ఎన్నికల్లో సత్తా చాటాలంటే కచ్చితంగా దూకుడు పెంచాల్సిందే. గత ఎన్నికలకు ముందు ఇదే దూకుడుతో అధికారంలోకి రాగలిగారు సీఎం రేవంత్. అయితే ఇప్పుడు విపక్షాలు పట్టు బిగిస్తుండడంతో తన రాజకీయ చతురతను మరింత రాటుదేలేలా వ్యవహరిస్తున్నారు సీఎం రేవంత్.

క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో: సంక్రాంతి పండుగ ముగిసిన వెంటనే రాష్ట్రంలోని ప్రతి పల్లెను స్వయంగా సందర్శించేలా.. ప్రజాబలం పేరుతో భారీ కార్యక్రమానికి సిద్ధం అవుతున్నారు. తన సొంత నియోజకవర్గమైన కొడంగల్ లో రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్ పో వేదికగా ఆయన చేసిన ప్రకటన పాలన యంత్రాంగాన్ని, రాజకీయ వర్గాలను ఒక్కసారిగా అప్రమత్తం చేసింది. సచివాలయానికి పరిమితం కాకుండా నేరుగా గ్రామాల్లోని గడప తొక్కి.. ప్రజా సమస్యలను స్వయంగా తెలుసుకోవడం.. ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాల అమలు తీరును క్షేత్రస్థాయిలో సమీక్షించడమే లక్ష్యంగా ఆయన ఈ కార్యక్రమాన్ని రూపొందించారు.

నాటి వైఫల్యాలే అస్త్రం..

గులాబీ పార్టీ పాలన వైఫల్యాలను ప్రధాన అస్త్రంగా చేసుకుని ప్రజల మధ్యకు వెళ్లాలనుకుంటున్నారు సీఎం రేవంత్. నీటిపారుదల అంశాలను రేవంత్ రెడ్డి వ్యూహాత్మకంగా ఎంచుకున్నారు. ఎల్ నినో వాతావరణ పరిస్థితులు, తీవ్రమవుతున్న కరువు ముప్పు దృష్ట్యా యాసంగి సీజన్ లో రైతులు ఆరుతడి పంటల వైపు మళ్లాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సంక్షోభ సమయాల్లో రైతులకు పూర్తి అండగా ఉంటామని భరోసా ఇస్తూనే..

- మిగతా 2వ పేజీలో




మాస్ లీడర్‌గా కేటీఆర్!

అడ్డుకునే పనిలో సీఎం రేవంత్

వ్యక్తిగత ఆహార్యం పై వ్యంగ్యోక్తులు

పక్కా రాజకీయ వ్యూహంతో తెలంగాణ ముఖ్యమంత్రి

క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో: తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి రూటు మార్చారు. తన మాటల దాడిని కేటీఆర్ వై ఎక్కు పెడుతున్నారు. గతంలో గులాబీ పార్టీ అగ్రనేత కెసిఆర్ ను, ఆయన



పవన్ కల్యాణ్‌తో విడాకులకు సంబంధించి ముందే హింట్ ఇచ్చిన

అన్నా కొణిదెల?

13 ఏళ్ల వివాహ బంధానికి ముగింపు పలికిన పవన్ కల్యాణ్, అన్నా కొణిదెల

పరస్పర అంగీకారంతోనే విడిపోతున్నట్లు అధికారికంగా ఉమ్మడి ప్రకటన విడుదల

అక్టోబర్ చివర్లోనే ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌ను డీయాక్టివేట్ చేసిన అన్నా


- మిగతా 2వ పేజీలో

జనసేనకు 5, బిజెపికి1..!

తేలిన జడ్పి పీఠాల లెక్క

టిడిపికి 20కి పైగా..

చైర్మన్ల ఎంపిక కత్తి మీద సామే





షర్మిల ఔట్!

పీసీసీ కి కొత్త సారథి

ఆమంచి కృష్ణమోహన్ కు అవకాశం

చీరాల విజయంతో మారిన హస్తం వ్యూహం

- మిగతా 2,3వ పేజీలో

తెలంగాణ నిరుద్యోగులకు శుభవార్త..

వైద్యశాఖలో 2,929 పోస్టుల భర్తీకి రంగం సిద్ధం

వైద్యారోగ్య శాఖలో 2,929 పోస్టుల భర్తీకి సన్నాహాలు

996 పోస్టులకు ఇప్పటికే ఆర్థిక శాఖ ఆమోదం

మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా నియామకాల ప్రక్రియ

ప్రస్తుతం కొనసాగుతున్న 2,711 పోస్టుల భర్తీ చివరి దశలో

కొంపముంచిన క్రాస్ ఓటింగ్!

అనంతపురంలో బిజెపి మేయర్ అభ్యర్థి ఓటమి

డివిజన్ల పరంగా టిడిపి కూటమి ఆధిక్యం

సీఎం చంద్రబాబు సీరియస్



క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో

అనంతపురం కార్పొరేషన్ లో బిజెపి మేయర్ అభ్యర్థి ఎందుకు ఓడిపోయారు? అక్కడ కూటమి మెజారిటీ డివిజన్లను గెలుచుకున్నా.. మేయర్ అభ్యర్థి విషయంలో ఎందుకు చతికల పడింది? పెద్ద ఎత్తున క్రాస్ ఓటింగ్ జరిగిందా? కూటమి కార్పొరేట్ అభ్యర్థులే క్రాస్ ఓటింగ్ కు ప్రోత్సహించారా? పొలిటికల్ వర్గాల్లో దీనిపై పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది.

- మిగతా 3వ పేజీలో



భక్తుల 'శివ'తాండవం!

కర్ణాటక సీఎం డీకే శివకుమార్ పై కట్టలు తెంచుకున్న ఆగ్రహం

హాసనాంబ దేవస్థానంలో ఘటన

క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్: ప్రజాగ్రహానికి ఎవరు అతీతులు కాదు. ఇప్పుడు కర్ణాటక సీఎం డీకే శివకుమార్ సైతం ప్రజాగ్రహానికి గురయ్యారు. ప్రజల ఆగ్రహాన్ని ప్రత్యక్షంగా చూశారు. కర్ణాటకలోని ప్రసిద్ధ హాసనాంబ ఆలయాన్ని ఏడాదికి ఒక్కసారి తెరుస్తారు. అమ్మవారి దివ్య దర్శనం కోసం పిల్లాపాపలు, వృద్ధులతో సహా వేలాదిమంది

- మిగతా 2వ పేజీలో

రాజీవ్ రాజకీయాల్లోకి రావొద్దని వేడుకున్నా..

రాహుల్ విషయంలో అడ్డుకోలేదు: సోనియా గాంధీ

సోనియా 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకం విడుదల

చిన్నప్పటి నుంచే రాహుల్‌కు రాజకీయాలంటే ఆసక్తి అని వెల్లడి

ముప్పని తెలిసినా రాజీవ్ రాజకీయాల్లో కొనసాగాడని వ్యాఖ్య

తండ్రి నిర్ణయాలను రాహుల్ గౌరవించేవాడని రాసిన సోనియా

అమేథీతో రాహుల్, ప్రియాంకకు ప్రత్యేక అనుబంధం ఉందని వెల్లడి

భర్త రాజీవ్ గాంధీ రాజకీయాల్లోకి రావడాన్ని తాను తీవ్రంగా



కరీంనగర్‌కు నితిన్ నబీన్..

లక్ష మందితో బీజేపీ మహా పాదయాత్ర

ఈ నెల 18న కరీంనగర్‌కు నితిన్ నబీన్ రాక

లక్ష మందితో మహా పాదయాత్రకు బీజేపీ ఏర్పాట్లు

బండి సంజయ్ నేతృత్వంలో కార్యక్రమ నిర్వహణ

గాంధీ సర్కిల్ నుంచి కమాన్ వరకు యాత్ర

పాదయాత్రలో పాల్గొననున్న రాంచందర్‌రావు

- మిగతా 2,3వ పేజీలో

ఏపీ వైపు మరో అల్పపీడనం..

దక్షిణ కోస్తా, రాయలసీమకు వర్షసూచన

ఈనెల 13న ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడనున్న అల్పపీడనం

24 గంటల్లో బలపడి వాయుగుండంగా మారే అవకాశం

దక్షిణ కోస్తా రాయలసీమ ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు

నవంబర్ 14 మరియు 15 తేదీల్లో మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరిక

తెలంగాణలో క్రమంగా పడిపోతున్న రాత్రి ఉష్ణోగ్రతలు

- మిగతా 3వ పేజీలో



రేవంత్ బహుముఖ వ్యూహం!



నీటిపారుదల ప్రాజెక్టుల పేరుతో గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను ఎండగట్టే దిశగా పావులు కదిపారు. ముఖ్యంగా కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు, మేడిగడ్డ బ్యారేజీ కొంగుబాటు వ్యవహారాలపై గులాబీ పార్టీ పదేపదే చేస్తున్న విమర్శలను తిప్పుకొట్టేందుకు.. రేవంత్ ఏకంగా సభ వేదికగానే సవాల్ ఎంచుకోవడం కాంగ్రెస్ దూకుడును స్పష్టం చేస్తోంది.

శాసనసభ వేదికగా..

మరోవైపు కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యాలు, గోదావరి జలాల యాజమాన్యం పై సమగ్రంగా చర్చించేందుకు శాసనసభ ప్రత్యేకంగా రెండు రోజులు సమావేశాలు నిర్వహించాలని.. స్పీకర్ను కోరినట్లు సీఎం రేవంత్ స్వయంగా ప్రకటించారు. ఇది రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఆధునిక సాంకేతిక ఆధారాలు, రికార్డులతో బహిరంగ చర్చకు సిద్ధం కావాలని కెసిఆర్ తో పాటు ఆ పార్టీ అగ్ర నేతలకు రేవంత్ బహిరంగ సవాల్ చేశారు. పది సంవత్సరాలపాటు అధికారం చలాయించి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి.. ప్రాజెక్టుల వైఫల్యాల్లోకి నెట్టారు అన్న కాంగ్రెస్ ప్రధాన ఆరోపణలను శాసనసభ వేదికగా ప్రజల ముందు ఉంచే ప్రయత్నంలో ఉన్నారు రేవంత్. బహుముఖ వ్యూహంతో రేవంత్ రాజకీయం నడుస్తుండగా.. కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న పరిణామాలు మాత్రం కలిసి వచ్చేలా లేవు. మరి ఈ విషయంలో రేవంత్ ఎంతవరకు సక్సెస్ అవుతారో చూడాలి.

కరీంనగర్‌కు నితిన్ నబీన్..





తెలంగాణలో పార్టీని మరింత బలోపేతం చేసి, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం దక్కించుకోవడమే లక్ష్యంగా బీజేపీ దూకుడు పెంచుతోంది. ఇందులో భాగంగా జాతీయ నాయకుల రాష్ట్ర పర్యటనలకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. తాజాగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ కరీంనగర్ పర్యటన ఖరారైంది. ఈ నెల 18న ఆయన నగరానికి రానున్నారు. ఈ సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ నేతృత్వంలో లక్ష మందితో భారీ పాదయాత్ర నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 'సర్' అంశంపై కాంగ్రెస్, ఇండీ కూటమి పార్టీలు రాజ్యాంగ సంస్థలపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని బీజేపీ ఆరోపిస్తోంది. ఈ ప్రచారాన్ని తిప్పికొట్టి ప్రజలకు వాస్తవాలు వివరించడమే లక్ష్యంగా పాదయాత్ర చేపడుతున్నట్లు పార్టీ నేతలు చెబుతున్నారు. నితిన్ నబీన్ తొలిసారి కరీంనగర్‌కు వస్తుండటంతో కార్యక్రమాన్ని భారీ స్థాయిలో నిర్వహించాలని బండి సంజయ్ నిర్ణయించారు.గాంధీ సర్కిల్, వైశ్య భవన్ నుంచి టవర్ సర్కిల్ మీదుగా కమాన్ వరకు పాదయాత్ర సాగనుంది. ఇందులో నితిన్ నబీన్‌తో పాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, బండి సంజయ్ పాల్గొననున్నారు. ఈ కార్యక్రమానికి లక్ష మంది హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు బండి సంజయ్ వెల్లడించారు. దేశవ్యాప్తంగా కరీంనగర్ పేరు మారుమోగేలా మహా పాదయాత్ర నిర్వహిస్తామని చెప్పారు. పాదయాత్ర ఏర్పాట్లపై చర్చించేందుకు బండి సంజయ్ కరీంనగర్ ఎంపీ కార్యాలయంలో పార్లమెంట్ నియోజకవర్గ కోర్ కమిటీ నేతలతో సమావేశమయ్యారు. బూత్ స్థాయి నుంచి మండలాల వారీగా సమావేశాలు నిర్వహించి కార్యకర్తలను సమీకరించాలని సూచించారు. మీడియా, సామాజిక మాధ్యమాల ద్వారా కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించాలని కోరారు.

పవన్ కల్యాణ్‌తో విడాకులకు సంబంధించి ముందే హింట్ ఇచ్చిన అన్నా కొణిదెల?

(మొదటి పేజీ తరువాయి)



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్, ఆయన భార్య అన్నా కొణిదెల తమ 13 ఏళ్ల వైవాహిక బంధానికి వీడ్కోలు పలికారు. పరస్పర అంగీకారం, గౌరవంతోనే విడిపోవాలని నిర్ణయించుకున్నట్లు ఈ దంపతులు అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు ఉమ్మడి ప్రకటనను మీడియాకు విడుదల చేశారు. 2013 సెప్టెంబర్‌లో పవన్ కల్యాణ్, అన్నా కొణిదెల వివాహం జరిగిన సంగతి తెలిసిందే. తమ ప్రకటనలో పవన్ కల్యాణ్, అన్నా కొణిదెల స్పందిస్తూ... "జీవితంలో ఎంతో ముఖ్యమైన ప్రయాణాన్ని పంచుకున్న తర్వాత, పరస్పర అవగాహన, గౌరవంతో విడిపోవాలని నిర్ణయం తీసుకున్నాం. మా వివాహ బంధం ముగిసినప్పటికీ, మంచి స్నేహితులుగా, మా పిల్లలకు బాధ్యతగల తల్లిదండ్రులుగా కొనసాగుతాం. పిల్లల ఆనందం, వారి భవిష్యత్తు, శ్రేయస్సే మా ఉమ్మడి ప్రాధాన్యత. జీవితంలో చోటుచేసుకున్న ఈ వ్యక్తిగత మార్పు సమయంలో మా నిర్ణయాన్ని అర్థం చేసుకుని, మా గోప్యతను గౌరవించాలని కోరుతున్నాం. ఇప్పటివరకు మా ప్రయాణంలో అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు" అని తెలిపారు. ఈ దంపతులకు కుమారుడు మార్క్ శంకర్ పవనోవిచ్, కుమార్తె పొలెనా అంజనా పవనోవా ఉన్నారు. మరోవైపు, గత అక్టోబర్ నెలాఖరులో అన్నా కొణిదెల తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను అకస్మాత్తుగా డీయాక్టివేట్ చేయడం అప్పట్లో తీవ్ర చర్చకు దారితీసింది. సోషల్ మీడియాలో ఎంతో యాక్టివ్‌గా ఉండే ఆమె ఖాతా కనిపించకపోవడంతో రకరకాల ఊహాగానాలు వినిపించినప్పటికీ, అప్పట్లో ఎలాంటి స్పష్టత రాలేదు. తాజాగా వీరి విడాకుల ప్రకటన వెలువడటంతో, అన్నా కొణిదెల అప్పట్లో సోషల్ మీడియాకు దూరమవడానికి కారణం ఇదేనంటూ నెటిజన్లు చర్చించుకుంటున్నారు.

జనసేనకు 5, బిజెపికి1..!

(మొదటి

క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో: ఏపీలో ప్రాదేశిక ఎన్నికలు పూర్తయ్యాయి. ఎంపీటీసీలతోపాటు జడ్పిటిసి ఎన్నికల్లో అధికార టిడిపి కూటమి ఘనవిజయం సాధించింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కనీస స్థాయిలో కూడా పోటీ ఇవ్వలేకపోయింది. 28 జిల్లా పరిషత్తులకు గాను ఏకంగా 27 జడ్పీ పీఠాలను కూటమి కైవసం చేసుకుంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేవలం అల్లూరి సీతారామరాజు జిల్లాకు మాత్రమే పరిమితం అయింది. అయితే ఇప్పుడు అసలు పరీక్ష కూటమికి మొదలుకానుంది. జిల్లా పరిషత్ చైర్మన్ పదవులను మూడు పార్టీల మధ్య పంచాల్సిన అనివార్య పరిస్థితి ఎదురైంది. పెద్దన్న పాత్రలో ఉన్న తెలుగుదేశం పార్టీ ఎన్ని స్థానాలను ఉంచుకుంటుంది? జనసేనకు ఎన్ని కేటాయించనుంది? బిజెపి పరిస్థితి ఏంటి అనే చర్చ జోరుగా సాగుతోంది.

ఒక కొలిక్కి..

ప్రాథమిక సమాచారం మేరకు తెలుగుదేశం 21 నుంచి 22 జడ్పీ పీఠాలను.. జనసేనకు జిల్లా పరిషత్ లను.. బిజెపికి ఒక కీలక స్థానాన్ని కేటాయించేందుకు సూత్రప్రాయంగా ఒక అంగీకారం కుదిరినట్లు ప్రచారం నడుస్తోంది. పరిషత్ ఎన్నికల్లో 73 జెడ్పిటిసి.. 900 కు పైగా ఎంపిటిసి స్థానాల్లో గెలిచింది జనసేన. తమకు కనీసం 8 జడ్పీ చైర్మన్ స్థానాలను కావాలని గట్టిగా పట్టుబట్టింది. అయితే క్షేత్రస్థాయి బలాబలాలు, సామాజిక సమీకరణలను పరిగణలోకి తీసుకుని జనసేనకు అయిదు జడ్పీ పీఠాలు ఇచ్చేందుకు టిడిపి అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. వాస్తవానికి అల్లూరి సీతారామరాజు జిల్లాను జనసేనకు కేటాయించాలని చూశారు. కానీ అక్కడ కూటమి గెలవలేదు. అందుకే ఇప్పుడు అనకాపల్లి లేదా తూర్పుగోదావరి జిల్లా ఖరారు అయినట్లు సమాచారం. వీటితోపాటు పల్నాడు, శ్రీకాకుళం, శ్రీ సత్య సాయి జిల్లా పరిధిలోని ఒక స్థానం జనసేనకు దక్కే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. మరోవైపు జడ్పీ వైస్ చైర్మన్ పదవులను సైతం జనసేనకు అధికంగా కేటాయించే పరిస్థితి కనిపిస్తోంది.


బిజెపికి కడప?

అనంతపురం కార్పొరేషన్ పదవిని బిజెపికి కేటాయిస్తే అక్కడ కూటమి మధ్య ఓట్ల బదలాయింపు సవ్యంగా జరగలేదు. అందుకే అక్కడ ఓటమి ఎదురైంది. ఇప్పుడు జిల్లా పరిషత్తు పీఠానికి సంబంధించి పులివెందుల ఉన్న కడప జిల్లా స్థానాన్ని బిజెపికి కేటాయించే అవకాశం ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. జమ్మలమడుగు బిజెపి ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి మొదటినుంచి కడప జడ్పీ పై కన్నేసి.. కూటమి విజయానికి తీవ్రంగా శ్రమించారు. మరోవైపు బిజెపిని పట్టుకొని ఇన్ని రోజులు జగన్ రాజకీయం చేశారు. అందుకే కీలకమైన కడప జడ్పీ పీఠాన్ని బిజెపికి అప్పగించి జగన్మోహన్ రెడ్డిని కోలుకోని దెబ్బతీయాలన్నది చంద్రబాబు ఆలోచనగా స్పష్టమవుతుంది. ఒకవేళ ఇదే నిజమైతే కడప రాజకీయ చరిత్రలోనే ఇది అతి పెద్ద మలుపుగా మారనుంది.

రేసులో వారసులు..

జడ్పీ చైర్మన్ పదవుల పంపకాలు చంద్రబాబుకు తలనొప్పిగా మారనున్నాయి. 20కి పైగా జడ్పీ పీఠాలు టిడిపికి దక్కుతాయి. కానీ రాష్ట్రవ్యాప్తంగా ఓ పదిమందికి పైగా సీనియర్లు తమ వారసులకు జడ్పీపీఠాలను ఇవ్వాలని గట్టిగానే డిమాండ్ చేస్తున్నారు. అనంతపురం జడ్పీ రేస్ లో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత తనయుడు శ్రీరామ్ ఉన్నారు.. తిరుపతిలో కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మీ కుమార్తె డాక్టర్ చేతన ఉన్నారు. పశ్చిమగోదావరిలో పితాని సత్యనారాయణ కుమారుడు వెంకట్, అన్నమయ్య జిల్లాలో సుగవాసి ప్రసాదబాబు వంటి బడా నేతలు గట్టి ప్రయత్నాల్లో ఉన్నారు. విజయనగరంలో కర్రోతు బంగారు రాజు కుమార్తె చంద్రకళ, చిన్న శ్రీను కుమార్తె సిరి సహస్ర రేసులో ఉన్నారు. అటువంటి చోట ఎంపిక అనేది చంద్రబాబుకు ఇబ్బందికరమే. అయితే నేతల మధ్య సమన్వయం చేసుకుని ప్రత్యామ్నాయ అవకాశాలు చూపి కొలిక్కి తెచ్చే అవకాశం ఉంది.

షర్మిల జోష్!



క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో: ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిలను మార్చుతారా? ఆమె స్థానంలో కొత్తవారికి బాధ్యతలు అప్పగిస్తారా? ఆమంచి కృష్ణమోహన్ కు అవకాశం ఇస్తారా? పొలిటికల్ వర్గాల్లో దీనిపైనే ఆసక్తికర చర్చ నడుస్తోంది. ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా షర్మిల నియామకం జరిగి మూడేళ్లు అవుతోంది. అందుకే ఇప్పుడు సంస్థాగతంగా ఆమె మార్పు అనివార్యం అని తెలుస్తోంది. దీనిపైనే రకరకాలుగా ప్రచారం సాగుతోంది.

గత ఎన్నికలకు ముందు..

2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా షర్మిల నియమితులయ్యారు. తెలంగాణలో తన తండ్రి పేరుతో పార్టీని ఏర్పాటు చేసిన షర్మిల అనుకున్న విధంగా అక్కడ రాణించలేకపోయారు. అందుకే కాంగ్రెస్ పార్టీలో విలీనం చేసి.. ఏపీ బాధ్యతలను తీసుకున్నారు. అయితే గత మూడు సంవత్సరాలుగా పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. కేవలం తన సోదరుడితో ఉన్న వ్యక్తిగత విభేదాలతో.. నిత్యం జగన్మోహన్ రెడ్డిని టార్గెట్ చేసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కనీస స్థాయిలో కూడా ఆమె కాంగ్రెస్ బలం పెంచలేకపోయారన్నది ప్రధాన అపవాదు. ఆపై కాంగ్రెస్ సీనియర్లతో ఆమెకు విభేదాలు ఉన్నాయి. అందుకే ఆమెను మార్చాలన్న డిమాండ్ ఉంది కాంగ్రెస్ పార్టీలో.

చీరాలలో రెండో స్థానం..

తాజాగా మున్సిపల్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. కానీ ఉమ్మడి ప్రకాశం జిల్లా చీరాలలో మాత్రం రెండవ స్థానంలో నిలిచింది. అక్కడ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి చైర్మన్గా గెలిచారు. 10 వార్డుల్లో కాంగ్రెస్ గెలిచి రెండో స్థానంలో నిలిచింది. దానికి కారణం ఆమంచి కృష్ణమోహన్. చీరాల నియోజకవర్గంలో బలమైన నేత. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను దించి అక్కడ గెలిపించుకున్నారు. అయితే ఒక్క చీరాల మాత్రమే కాదు. బలమైన నాయకత్వం ఇవ్వడం ద్వారా రాష్ట్రంలో కూడా పుంజుకోవచ్చు అని ఈ విజయం సూచించింది. అందుకే కాంగ్రెస్ హైకమాండ్ షర్మిలను మార్చాలన్న నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.

తెరపైకి కృపారాణి పేరు..

అయితే ప్రముఖంగా పిసిసి అధ్యక్ష పదవికి శ్రీకాకుళం జిల్లాకు చెందిన కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి పేరు వినిపిస్తోంది. ఆమెతోపాటు జీవీ హర్ష కుమార్ వంటి వారి పేర్లు కూడా బయటకు వచ్చాయి. అయితే ఇప్పుడు ఆమంచి కృష్ణమోహన్ సైతం రేసులోకి వచ్చారు. ఆయనకు ఛాన్స్ ఇస్తే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పుంజుకునే అవకాశం ఉందన్న వాదనలు పెరుగుతున్నాయి. చీరాల మున్సిపాలిటీలో కాంగ్రెస్ రెండో స్థానంలో నిలవడం వైసీపీకి షాక్ గా మారింది. అందుకే ఆమంచి కృష్ణమోహన్ కు పిసిసి అధ్యక్ష పదవి ఇచ్చి.. షర్మిలను ఏఐసీసీలోకి తీసుకుంటారని టాక్ ప్రారంభం అయింది. అందులో ఎంతవరకు వాస్తవం ఉందో చూడాలి.

భక్తుల 'శివ'తాండవం!



భక్తులు ఆకలి దప్పులతో, అలసటతో మహిళకొద్ది బారికేడ్లలో గంటల తరబడి ఉంటారు. అయితే సాధారణ భక్తుల దర్శనాలను నిర్దాక్షిణ్యంగా నిలిపివేసి... సీఎం డీకే శివకుమార్ బృందానికి రెడ్ కార్పెట్ వేసి రాచ మర్యాదలు చేయడంతో.. భక్తులు ఒక్కసారిగా ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం తీరుపై తీవ్రంగా ఆక్షేపించారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఇదే సంచలన వార్తగా మిగిలింది.

ఏర్పాట్లలో విఫలం..

ప్రసిద్ధ ఆలయంగా పేరు పొందిన ఆ ఆధ్యాత్మిక కేంద్రం వద్ద ఏర్పాట్లలో ప్రభుత్వం విఫలమయింది. పైగా ఆర్భాటం చేయడం భక్తుల్లో ఆగ్రహం పెరిగింది. పుణ్యం దక్కుతుందన్న ఆశతో తెల్లవారుజాము నుంచి కాళ్ళరిగేలా క్యూ లైన్ లలో పడిగాపులు కాస్తున్న వేలాది మందికి.. కనీసం తాగునీరు, ప్రాథమిక వసతులు కల్పించడంలో యంత్రాంగం దారుణంగా విఫలమైంది. గంటలు గడుస్తున్నా లైన్లు ఇసుమంతైనా కదలకుం డా.. సామాన్యులను తొక్కిసలాటలో నెట్టేసిన అధికారులు.. అదే సమయంలో ప్రజా ప్రతినిధులు, వారి అనుచర గణానికి ప్రత్యేక దారులు గుండా గర్భగుడిలోకి దర్జాగా ప్రవేశం కల్పించడం భక్తులకు కడుపు మంటను రగిలించింది. అదే సమయంలో ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారీ ఎల్ఈడి స్క్రీన్ పై డీకే శివకుమార్ వీఐపీ ఘర్షణ దృశ్యాలు ప్రసారం కావడం భక్తుల్లో మరింత ఆగ్రహానికి కారణమైంది. స్క్రీన్ లపై బూట్లు విసిరిన వైనం.. గర్భగుడిలో ప్రజా ప్రతినిధులు దైవ సన్నిధిని తమ ప్రైవేటు ప్రోటోకాల్ వేదికగా మార్చుకుని.. నింపాదిగా పూజలు చేసుకుంటున్న విజువల్స్ కనిపించగానే లైన్లో ఉన్న భక్తులు ఒక్కసారిగా అసహనానికి గురయ్యారు. భక్తులు ఏకంగా తమ కాళ్లకు ఉన్న చెప్పులు, బూట్లను తీసి డీకే శివకుమార్ ముఖం కనిపిస్తున్న ఆ భారీ స్క్రీన్ లపై విసిరి కొట్టారు. దేవుడు ముందు ధనిక, పేద... పాలకుడు- ప్రజలు అన్న తేడాలు ఉండకూడదు అన్న కనీసం న్యాయాన్ని పాలకులు మరిచిపోతే.. డీకే శివకుమార్ కు ఎదురైన పరిణామమే ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఈ ఘటనతో డీకే శివకుమార్ ఇమేజ్ కు డ్యామేజ్ కలిగింది. ఇటీవల ఆయన హిందుత్వవాదానికి బలంగా నమ్ముతున్నారు. ఇంతలోనే ఈ ఘటన చోటు చేసుకోవడం నిజంగా ఆయనకు ఇబ్బందికరమే.

తెలంగాణ నిరుద్యోగులకు శుభవార్త..



తెలంగాణ వైద్యారోగ్య శాఖలో మరో భారీ నియామక ప్రక్రియకు రంగం సిద్ధమవుతోంది. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 2,929 పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. వీటిలో 996 పోస్టులకు ఆర్థిక శాఖ ఇప్పటికే అనుమతి ఇవ్వగా, మరో 1,933 పోస్టులకు ఆమోదం లభించాల్సి ఉంది. త్వరలోనే ఈ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు వెలువడే అవకాశం ఉంది. ఆర్థిక శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన 996 పోస్టుల్లో సివిల్ అసిస్టెంట్ సర్జన్ (198), ఆయుష్ ఫార్మసిస్ట్ గ్రేడ్-2 (308), టెక్నీషియన్ (290) వంటి కీలకమైన పోస్టులు ఉన్నాయి. వీటితో పాటు బయోమెడికల్ ఇంజనీర్లు, ఫిజియోథెరపిస్టులు, రేడియోగ్రాఫర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఏఎన్ఎం పోస్టులను కూడా భర్తీ చేయనున్నారు. ఈ నియామకాలను తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ), ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్, వైద్య విద్య సంచాలకులు (డీఎంఈ), ఆయుష్, ఎంఎన్‌జే వంటి పలు విభాగాల్లో చేపట్టనున్నారు. ప్రభుత్వం అనుమతి కోసం ఎదురుచూస్తున్న 1,933 పోస్టుల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ (716), సివిల్ అసిస్టెంట్ సర్జన్ (మొత్తం 422), స్టాఫ్ నర్సు (194), ల్యాబ్ టెక్నీషియన్ (96) వంటి ముఖ్యమైన ఖాళీలు ఉన్నాయి. వీటికి కూడా ఆర్థిక శాఖ నుంచి ఆమోదం రాగానే నోటిఫికేషన్లు విడుదల చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఈ నియామక ప్రక్రియను మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఎంఆర్‌బీ) ద్వారా వేగవంతం చేయనుండగా, జూనియర్ అసిస్టెంట్ పోస్టులను మాత్రం టీఎస్‌పీఎస్సీ భర్తీ చేయనుంది.కాగా, ప్రస్తుతం ఎంఆర్‌బీ ఆధ్వర్యంలో 2,711 పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో 1,931 ఎంపీహెచ్ఏ (మహిళ) పోస్టుల నియామకాలు దాదాపు పూర్తికాగా, త్వరలో తుది జాబితా రానుంది. మరోవైపు, 48 డెంటల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులకు 4 వేలకు పైగా దరఖాస్తులు రావడంతో, వాటి పరిశీలనకు సమయం పడుతోందని అధికారులు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైద్యశాఖలో ఇప్పటివరకు 13,401 పోస్టులను భర్తీ చేయడం గమనార్హం.

మాస్ లీడర్‌గా కేటీఆర్!

(మొదటి పేజీ తరువాయి)

పాలన వైఫల్యాలను ప్రధానంగా ఎండగట్టే వారు. కానీ ఇటీవల కాలంలో కేటీఆర్ ను వ్యక్తిగతంగా, ఎమోషనల్ గా దెబ్బకొట్టే వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. ప్రభుత్వ అధికారిక వేదికల్లో సైతం కేటీఆర్ గడ్డం, మీసాలు, ఆహార్యం, కొత్త లుక్ వంటి పూర్తి వ్యక్తిగత విషయాలపై నేరుగా విరుచుకుపడుతున్నారు. ఒక రాజకీయ నాయకుడి మేకోవర్ ఆయన వ్యక్తిగత ఇష్టాఇష్టాలకు సంబంధించిన వ్యవహారం అయినప్పటికీ.. దానిని రేవంత్ రెడ్డి పదేపదే రాజకీయ వేదికల పైకి లాగి ఎగతాళి చేయడం వెనుక లోతైన రాజకీయ వ్యూహమే కనిపిస్తోంది.

కార్పొరేట్ గ్లామర్ ను ఆసరాగా చేసుకుని..


కేటీఆర్ కు ఉన్న అర్బన్, కార్పొరేట్ గ్లామర్ పటాపంచలు చేయడమే ఈ వ్యూహంలో భాగం. శాసనసభ ఎన్నికల పరాజ్యం తర్వాత కేసీఆర్ ఎక్కువగా ఫామ్ హౌస్ కే పరిమితం అయ్యారు. వయోభారంతో పాటు అనారోగ్య కారణాల దృష్ట్యా పార్టీ బాధ్యతలను అనధికారికంగా కేటీఆర్ ముందుండి నడిపిస్తున్నారు. భవిష్యత్తు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రధాన ప్రత్యర్థులు కేటీఆర్ అన్న స్పష్టత రేవంత్కు ఉంది. అందుకే ఆయనకు యువత, విద్యావంతుల్లో ఉన్న ఇమేజ్ ను గ్రామీణ ప్రజలు దృష్టిలో పలుచన చేయాలన్నది రేవంత్



ఎత్తుగడ. గడ్డం పెంచినంతమాత్రాన విప్లవకారుడు లేదా ప్రజా నాయకుడు కాలేరని.. ఇదంతా కేవలం ఓట్ల కోసం చేస్తున్న సినిమాటిక్ గెటప్ మాత్రమేనని ప్రజల మెదల్లోకి ఎక్కించడం ద్వారా.. కేటీఆర్ ను క్షేత్రస్థాయి మాస్ లీడర్ గా స్థిరపడకుండా అడ్డుకునే ప్రయత్నం అని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

మానసికంగా దెబ్బ కొట్టాలని..

మానసికంగా కేటీఆర్ ను దెబ్బ కొట్టాలన్న వ్యూహంలో భాగంగానే రేవంత్ సంచలన ప్రకటనలు చేస్తున్నారు. మానసికంగా, భావోద్వేగ పరంగా ఆత్మరక్షణలోకి నెట్టి.. సైకలాజికల్ వార్ ఫేర్ కూడా ఇందులో దాగుంది. సాధారణంగా కేటీఆర్ అంశాల వారీగా ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ప్రయత్నిస్తుంటారు. పాలనతో పాటు హామీల అమలు, రుణమాఫీ, హైడ్రా వంటి సున్నితమైన అంశాలపై గులాబీ పార్టీ గట్టిగా మాట్లాడినప్పుడు.. వాటిపై సమాధానాలు చెప్పే దానికంటే వ్యక్తిగత దాడితో కేటీఆర్ ను భావోద్వేగానికి గురిచేసి.. అసహనం కోల్పోయేలా చేయడం రేవంత్ వ్యూహం. కేటీఆర్ తన రూపురేఖలు, ఆహారంపై వస్తున్న విమర్శలకు వివరణలు ఇచ్చుకుంటే.. ప్రభుత్వంపై చేయాల్సిన పాలనాపరమైన దాడి తనంతట అదే పక్కదారి పడుతుంది అనేది రేవంత్ ఆలోచన. ఆయన విసిరే వ్యక్తిగత వలలు కేటీఆర్ పడి ప్రతిదాడికి దిగితే... చర్చ మొత్తం అసలు సమస్యలను వదిలేసి వ్యక్తిగత దూషణల చుట్టూ తిరగనుంది. మరోవైపు కేసీఆర్ కంటే కేటీఆర్ పై విరుచుకు పడడం రేవంత్ కు సులువైన అంశం. అందుకే కేటీఆర్ పై వ్యక్తిగత దాడి చేస్తున్నారు. ప్యాలెస్ లీడర్ గా ముద్ర వేసే ప్రయత్నంలో ఉన్నారు. దీనిని కేటీఆర్ ఎలా ఎదుర్కొంటారో చూడాలి



కొంపముంచిన క్రాస్ ఓటింగ్!

మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా.. 13 కార్పొరేషన్లలో 12 చోట్ల కూటమి పార్టీలు విజయం దక్కించుకున్నాయి. వీటిలో మెజారిటీ స్థానాలను టిడిపి కైవసం చేసుకుంది. విజయవాడ, ఏలూరులో మాత్రమే జనసేన గెలిచింది. అయితే టిడిపికి కంచుకోట వంటి అనంతపురంలో వైసీపీ గెలుపు గుర్రం ఎక్కడం ఆ పార్టీకి ఇప్పుడు సంకట స్థితిగా మారింది. దీనిపై అధినేత చంద్రబాబు సీరియస్ గా ఉన్నారు. తెర వెనుక ఏం జరిగింది అనే దానిపై నివేదికలు తెచ్చుకుంటున్నారు. కూటమి పార్టీల కార్పొరేట్ అభ్యర్థులు క్రాస్ ఓటింగ్ కు పాల్పడినట్లు పెద్ద ఎత్తున ప్రచారం నడుస్తోంది. డివిజన్లో కార్పొరేటర్ కు ఓటు వేసి.. మేయర్ ఓటు విషయంలో మీ ఇష్టం అన్నట్లు కొందరు వ్యవహరించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

టిడిపికి బలం..

వాస్తవానికి సార్వత్రిక ఎన్నికల్లో అనంతపురం జిల్లాలో టిడిపి కూటమి ఏకపక్షంగా విజయం సాధించింది. అనంతపురం నగరంలో కూడా పార్టీకి మంచి పట్టు ఉంది. అయితే ఆ కార్పొరేషన్ ను బిజెపికి కేటాయించారు. ఆ పార్టీ అభ్యర్థిగా అజిష్ బాబు పోటీ చేశారు. టిడిపికి బలమైన నగరాన్ని బిజెపికి కేటాయించడంపై తెలుగు తమ్ముళ్లు ఆవేదన చెందారు. కొంతవరకు సహాయ నిరాకరణ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. కానీ అధినేత చంద్రబాబు ఆదేశాలతో టిడిపి శ్రేణులు ప్రచారంలో పాల్గొన్నాయి. కానీ ఇక్కడ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రమేష్ గౌడ్ సంచలన విజయం నమోదు చేసుకున్నారు. ఏకంగా 5981 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. అదే సమయంలో 62 డివిజన్లలో 37 చోట్ల టిడిపి విజయం సాధించింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 21 చోట్ల మాత్రమే గెలిచింది. అయినా సరే వైఎస్ఆర్సిపి మేయర్ అభ్యర్థి గెలవడంపై ఇప్పుడు కూటమిలో బలమైన చర్చ నడుస్తోంది.

కొందరు నేతల తీరుతోనే..

కూటమి పార్టీ నుంచి భారీగా క్రాస్ ఓటింగ్ జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మేయర్ అభ్యర్థి రమేష్ గౌడ్ కు 62,219 ఓట్లు వచ్చాయి. బిజెపి అభ్యర్థి ఆజిస్ బాబుకు 56,238 ఓట్లు వచ్చాయి. టిడిపి కూటమి కార్పొరేట్ అభ్యర్థులకు ఓట్లు వేసిన ఓటర్లలో కొందరు.. మేయర్ అభ్యర్థి విషయానికి వచ్చేసరికి వైయస్సార్సీపీకి మద్దతుగా ఓటు వేశారని స్పష్టమవుతుంది. కూటమి పార్టీల మధ్య సమన్వయ లోపం, ఓట్ల బదిలీ సరిగ్గా జరగకపోవడం వంటి కారణాలతోనే బిజెపి అభ్యర్థి ఓడిపోయారు అనేది ఇప్పుడు జరుగుతున్న ప్రచారం. దీనిపై సీఎం చంద్రబాబు సీరియస్ గా ఉన్నారు. అనంతపురంలో జరిగిన వ్యవహారంపై నివేదిక తెచ్చుకున్నారు. కొందరు నేతలు తీరుపై అంతర్గతంగా పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. చర్యలకు ఉపక్రమించే అవకాశం కూడా ఉంది.


రాజీవ్ రాజకీయాల్లోకి రావొద్దని వేడుకున్నా..



భర్త రాజీవ్ గాంధీ రాజకీయాల్లోకి రావడాన్ని తాను తీవ్రంగా వ్యతిరేకించానని, ఆయన ఆ రంగంలోకి వెళ్లవద్దని వేడుకున్నానని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ వెల్లడించారు. అయితే కుమారుడు రాహుల్ గాంధీ రాజకీయాల్లోకి రావాలనుకున్నప్పుడు మాత్రం తాను అడ్డుకోలేదని తెలిపారు. తన జీవిత ప్రయాణాన్ని వివరిస్తూ రాసిన 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకంలో ఈ విషయాలను ప్రస్తావించారు. ఈ పుస్తకం మంగళవారం ప్రపంచవ్యాప్తంగా విడుదలైంది. రాహుల్‌కు చిన్నప్పటి నుంచే రాజకీయాలపై ఆసక్తి ఉండేదని సోనియా గుర్తుచేసుకున్నారు. ముప్పు ఉందని తెలిసినా రాజీవ్ ధైర్యంగా రాజకీయాల్లో కొనసాగిన తీరును రాహుల్ గౌరవించేవారని తెలిపారు. రాజీవ్ రాజకీయాల్లోకి వెళ్లవద్దని దశాబ్దాల క్రితమే తాను వేడుకున్నానని, ఆ నిర్ణయం వల్ల కుటుంబం కూడా ప్రమాదకరమైన పరిస్థితుల్లోకి వెళ్లాల్సి వస్తుందని ఆందోళన చెందానని పుస్తకంలో రాశారు. తండ్రి రాజకీయాల్లో కొనసాగడంపై రాహుల్ విభేదించిన సందర్భాలు కూడా ఉన్నాయన్నారు. అయినప్పటికీ రాజీవ్ విలువలు, ధైర్యం పట్ల ఆయనకు ఎంతో గౌరవం ఉండేదని పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని అమేథీ నియోజకవర్గంతో రాహుల్, ప్రియాంక గాంధీ వాద్రాలకు విడదీయలేని అనుబంధం ఉందని సోనియా తెలిపారు. రాహుల్‌ను చిన్నతనంలోనే రాజీవ్ పలుమార్లు అమేథీకి తీసుకెళ్లారని, గ్రామీణ ప్రాంతాల వాస్తవ పరిస్థితులను దగ్గరగా పరిచయం చేసేందుకు కూడా ప్రయత్నించారని గుర్తుచేసుకున్నారు. ప్రియాంక కూడా కుటుంబం పోటీ చేసిన ప్రతి ఎన్నికలో అమేథీలోనే ఉండి పార్టీ కార్యకర్తలకు, ప్రజలకు దగ్గరయ్యారని చెప్పారు. అయితే ఆ సమయంలో ప్రియాంక ప్రధానంగా తన పిల్లల పెంపకం, బౌద్ధ అధ్యయనాల్లో పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా పూర్తి చేయడంపై దృష్టి పెట్టారని సోనియా వివరించారు. రాహుల్ విదేశాల నుంచి భారత్‌కు వచ్చినప్పుడల్లా తాను లేదా ప్రియాంకతో కలిసి అమేథీకి వెళ్లేవారని తెలిపారు. ఆ పర్యటనల సమయంలోనే అక్కడి ప్రజలతో మరింతగా మమేకమై, వారి తరఫున పనిచేయాలనే ఆసక్తి రాహుల్‌లో పెరిగిందని పేర్కొన్నారు. కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో రాహుల్ ఎంఫిల్ కోసం డెవలప్‌మెంట్ స్టడీస్ ఎంచుకున్నారని సోనియా తెలిపారు. విదేశాల్లో ఉద్యోగం చేస్తున్న సమయంలోనూ భారత్‌లో రాజకీయ పరిణామాలను నిశితంగా గమనించేవారని చెప్పారు. రాహుల్ క్రియాశీల రాజకీయాల్లోకి రావాలని పార్టీ నేతలు బలంగా కోరారని, ఆ నిర్ణయం తీసుకుంటే ఆయన జీవన విధానం పూర్తిగా మారిపోతుందని వివరించారు. ప్రజా జీవితంలోకి వచ్చాక ప్రతి అడుగునా పరిశీలన, విమర్శలు ఎదుర్కోవాల్సి ఉంటుందని రాహుల్‌కు తెలుసన్నారు. తనతో, ప్రియాంకతో చర్చించిన తర్వాత, చాలాసేపు ఆలోచించి ఆయన రాజకీయాల్లోకి రావాలని నిర్ణయించుకున్నారని సోనియా వెల్లడించారు. 2004 మార్చిలో అమేథీ నుంచి పోటీ చేస్తానని రాహుల్ ప్రకటించారు. సోనియా గాంధీ పక్కనే ఉన్న రాయ్‌బరేలీ నియోజకవర్గం నుంచి బరిలోకి దిగారు. తొలి ఎన్నికలోనే రాహుల్ భారీ మెజార్టీతో గెలిచారని సోనియా పేర్కొన్నారు. అనంతరం తన బాధ్యతలను ఉత్సాహంగా స్వీకరించి, రాజీవ్ గాంధీ తరహాలో గ్రామీణ అమేథీలో పరిశ్రమలు, వ్యాపార సంస్థల ఏర్పాటుకు కృషి చేశారని తెలిపారు.



ఏపీ వైపు మరో అల్పపీడనం..



ఆగ్నేయ బంగాళాఖాతంలో ఈనెల 13న కొత్తగా అల్పపీడనం ఏర్పడే అవకాశముందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. ఇది ఏర్ప డిన 24 గంటల్లోనే మరింత బలపడి తీవ్ర అల్పపీడనంగా, ఆపై వాయు గుండంగా మారే సూచనలు ఉన్నాయని అధికారులు తెలిపారు. అనంతరం ఇది పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ నవంబర్ 18 లేదా 19 నాటికి ఉత్తర తమిళనాడు తీరానికి చేరుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్‌పై ప్రభావం

ఈ అల్పపీడనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయి. అయితే భారీ వర్షాల కంటే ఎక్కువగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు మాత్రమే నమోదయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉత్తర కోస్తాంధ్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ పరిసరాల్లో ఉపరితల ద్రోణి కొనసాగుతుండటంతో రాబోయే మూడు రోజుల పాటు రాష్ట్రంలో పొడి వాతావరణమే ఉంటుందని వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది.

తుపానుగా మారే అవకాశం తక్కువే

ప్రస్తుత సమాచారం ప్రకారం ఈ అల్పపీడనం తుపానుగా మారే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయి. అయితే ఇటీవలే వచ్చిన అర్నబ్, మురసు తుపానుల ప్రభావంతో రాష్ట్రంలో పంటలు, రహదారులు, విద్యుత్ స్తంభా లకు భారీ నష్టం వాటిల్లిన నేపథ్యంలో అధికారులు తాజా పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నారు. రానున్న రోజుల్లో బంగాళాఖాతంలో మరిన్ని తుపానులు లేదా తీవ్ర అల్పపీడనాలు ఏర్పడే పరిస్థితులు లేకపోలేదని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు.

మత్స్యకారులకు హెచ్చరికలు

తాజా అల్పపీడన పరిణామాలతో అండమాన్ సముద్రం, ఆగ్నేయ బంగాళాఖాతంలో వాతావరణం అలజడిగా మారనుంది. సముద్రంలో అలల ఉద్ధృతి పెరగడంతో పాటు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో నవంబర్ 14, 15 తేదీల్లో మత్స్యకారులు ఎవరూ సముద్రంలోకి వేటకు వెళ్లకూడదని విపత్తు నిర్వహణ అధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

తెలంగాణలో పెరుగుతున్న చలి

మరోవైపు తెలంగాణ రాష్ట్రంలో చలి తీవ్రత క్రమంగా పెరుగుతోంది. సోమవారం రాత్రి రాష్ట్రంలోని దాదాపు 16 జిల్లాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు 14.7 డిగ్రీల నుంచి 15 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయాయి. అత్యల్పంగా ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండలో 14.7 డిగ్రీల రాత్రి ఉష్ణోగ్రత నమోదైంది. రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ అల్పపీడనం ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నందున, దాని గమనం మరియు తీవ్రతలో మార్పులు జరిగే అవకాశం ఉంది. పరిస్థితిని బట్టి వాతావరణ శాఖ ఎప్పటికప్పుడు తాజా బులెటిన్ల ద్వారా స్పష్టత ఇవ్వనుంది.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో కీలక పరిణామం

యూకేలో ఉంటున్న నిందితుడిపై లుక్ అవుట్ సర్క్యులర్ జారీకి కోర్టు ఆదేశాలు

నాన్ బెయిలబుల్ వారెంట్ అమలుకు పోలీసులకు ఆదేశం.. న్యాయ ప్రక్రియ నుంచి తప్పించుకునే అవకాశం లేదని స్పష్టం

రంగారెడ్డి జిల్లా, క్రైమ్ మిర్రర్: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. విదేశాల్లో ఉంటున్నట్లు సమాచారం అందిన నిందితుడిపై లుక్ అవుట్ సర్క్యులర్ జారీ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా ఎల్.బి. నగర్‌లోని ప్రత్యేక సెషన్స్ కోర్టు పోలీసులను ఆదేశించింది. ఈ మేరకు 2026 సెప్టెంబర్ 15న కోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది.

యూకేలో ఉంటున్నట్లు సమాచారం..

ఎస్సీ, ఎస్టీ (అత్యాచారాల నివారణ) చట్టం, 1989 కింద నమోదైన కేసు నంబర్ రాజ/0700072/2019 ప్రస్తుతం ఎల్.బి. నగర్ ప్రత్యేక సెషన్స్ కోర్టులో విచారణలో ఉంది. ఈ కేసులో నాలుగో నిందితుడిగా ఉన్న భారత్ సింగ్ ఠాకూర్ (తండ్రి: దివంగత శంకర్ సింగ్ ఠాకూర్) ప్రస్తుతం యునైటెడ్ కింగ్‌డమ్‌లో ఉంటున్నట్లు సమాచారం అందడంతో కోర్టు ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుంది.

ఎల్ఓసీ జారీకి చర్యలు తీసుకోవాలని ఆదేశం

నిందితుడు విదేశాల్లో ఉన్న నేపథ్యంలో అతని కదలికలను గుర్తించి, చట్టపరమైన ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు లుక్ అవుట్ సర్క్యులర్ (లూజ) జారీ చేయడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీసు అధికారులను కోర్టు ఆదేశించింది. తద్వారా నిందితుడు దేశంలోకి ప్రవేశించే సమయంలో లేదా విదేశాలకు వెళ్లే సందర్భంలో చట్టప్రకారం అవసరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.

ఎన్‌బీడబ్ల్యూ అమలుకు కూడా ఆదేశాలు

ఇదే సమయంలో నిందితుడిపై ఇప్పటికే జారీ అయిన నాన్ బెయిలబుల్ వారెంట్ అమలుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌ను కోర్టు ఆదేశించింది. కోర్టు ఉత్తర్వుల మేరకు పోలీసులు తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టాల్సి ఉంది.

చట్టం ముందు అందరూ సమానమే..

ఈ పరిణామం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణలో న్యాయస్థానాల వైఖరిని, నిందితులు దేశ సరిహద్దులు దాటి ఉన్నప్పటికీ న్యాయ ప్రక్రియ కొనసాగాల్సిన ఆవశ్యకతను మరోసారి చాటిచెబుతోంది. రాజ్యాంగం కల్పించిన సమానత్వం, న్యాయం, జవాబుదారీతనం వంటి విలువలకు అనుగుణంగా చట్టం ప్రతి ఒక్కరికీ సమానంగా వర్తించాలనే అంశాన్ని ఈ ఉత్తర్వులు గుర్తుచేస్తున్నాయి.కోర్టు ఆదేశాలను సంబంధిత పోలీసు అధికారులు తక్షణమే, బాధ్యతాయుతంగా అమలు చేయాల్సి ఉంది. ఈ కేసులో తదుపరి పరిణామాలు ఎలా ఉండబోతున్నాయన్నది ఆసక్తికరంగా మారింది.



క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
4 బుధవారం 11-11-2026



ఘనంగా సదర్ ఉత్సవాలు...

క్రైమ్ మిర్రర్, మాదాపూర్: మాదాపూర్ డివిజన్ హార్జిన బస్తీ లో సదర్ ఉత్సవాలు మీట్టు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సదర్ ఉత్సవాలలో జూబ్లీహిల్స్ నియోజవర్గం ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ..మాదాపూర్ ఊరులో పోచమ్మ, మహంకాళి దేవాలయం, మల్లన్న దేవాలయం నుండి మాదాపూర్ ఊర్లో గుడిని దర్శించుకొని, అయ్యప్ప సొసైటీలో స్టేజ్ దగ్గర దున్నపోతు విన్యాసాలలో పాల్గొని తప్పకుండా విజయం సాధిస్తామని నిర్వాహకులు తెలిపారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా సదర్ ఉత్సవాలు ఘనంగా జరుగుతాయని వారు తెలిపారు.

శివాలయం లో ఆకాశ దీపం



చిట్యాల క్రైమ్ మిర్రర్: కార్తీక మాసాన్ని పురస్కరించుకొని మొదటి రోజు మంగళవారం చిట్యాల శివాలయంలో సాయం కాలం ఆకాశదీపాన్ని వెలిగించారు. ధ్వజస్తంభం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పాత్రలో దీపాన్ని వెలిగించి జెండా ను ఎగరవేసినట్టుగా పాత్రను ధ్వజస్తంభం చివర పైకి పంపించి ఆకాశదీపాన్ని వెలిగించి పంపించారు. భక్తులు ఆకాశదీ పాన్ని దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. హర హర మహాదేవ...ఓం నమశ్శివాయ అంటూ భక్తులు పరమశివుడిని కొలిచారు. కార్తీకమాసం సందర్భంగా ఏమాసం మొత్తం ప్రతిరోజు ఆకాశదీపాన్ని వెలిగిస్తామని పురోహితులు తెలిపారు. కార్యక్రమం లో పురోహితులు గోవింద్ శర్మ, బబ్లు శుక్లా,, శ్రీ కనకదుర్గ దేవాలయం కమిటీ డైరెక్టర్ రుద్రారపు లింగయ్య, వేలుపల్లి రవీందర్, అన్నపూర్ణ, నామని హరిత, రేగొండ వేణుమాధవ్ ఏళ్ల వెంకన్న భక్తులు పాల్గొన్నారు.

త్రాగునీటిలో మురికి నీరు...

అనారోగ్యబారిన పడుతున్న స్థానిక ప్రజలు

వాటర్ బోర్డు డీజీఏమ్ త్రినాథరావు ని కలిసి సమస్యలు వివరించిన జనసేన నాయకులు కొల్లా శంకర్




కూకట్ పల్లి, నవంబర్ 10 (క్రైమ్ మిర్రర్) : కూకట్ పల్లి నియోజకవర్గం, కేపీహెబి 4వ ఫేస్ గత కొన్ని నెలలుగా వేధిస్తున్న తాగునీటి సమస్యపై ఎల్ఐజి కాలనీవాసులు జనసేన కూకట్ పల్లి కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ దృష్టికి వారి యొక్క త్రాగునీటి సమస్యను తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ప్రేమకుమార్ సూచనలు మేరకు జనసేన పార్టీ కూకట్ పల్లి కోఆర్డినేటర్ కొల్లాశంకర్ మంగళవారం తాగునీటి సమస్యపై స్థానిక ప్రజలతో కలిసి వాటర్ బోర్డు డీజీఏమ్ త్రినాథరావు ని కలిశారు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలను జనసేన నాయకులు కొల్లా శంకర్ వివరిస్తూ తాగునీటిలో మురుగునీరు కలవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారాని, నీటి సరఫరా ప్రారంభమైన 30 నిమిషాల్లో మొదటి 10 నిమిషాలు కలుషితమైన మురికినీరే వస్తోందని, ఆ తర్వాతే మంచి నీరు వస్తుందని, స్థానిక ప్రజలు అనారోగ్యానికి పాల్పడుతున్నారని, ప్రజల ఆరోగ్యం పై దృష్టి సారించాలని ఈ సమస్యపై తగిన చర్యలు తీసుకోవాలని త్రినాథరావు దృష్టికి తీసుకెళ్లారు. ఈ తీవ్రమైన సమస్యపై వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయనను కోరారు. జనసేన నాయకులు తెలిపిన సమస్యపై త్రినాథరావు తక్షణమే సానుకూలంగా స్పందించారు. నెల రోజుల్లోగా ఈ సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. అదే విధంగా, స్థానిక ప్రజలు కూడా అధికారులకు సహకరించాలని, తాగునీటిని వృథా చేయవద్దని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఆళ్ల నరేంద్ర, పుప్పాల అంజి, దాసరి వెంకట్, కాలనీ మహిళలు పాల్గొన్నారు.

కుమారుడి పెళ్లి పత్రికలకు 16 ఆలయాల్లో జగ్గారెడ్డి దంపతులు పూజలు

తూర్పు భరత్ సాయిరెడ్డితో కలిసి ప్రత్యేక పూజలు


తాత, నానమ్మ చిత్రపటానికి నమస్కరించి పెద్దల ఆశీర్వాదం తీసుకున్న వధూవరుడు





సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి నవంబర్ 10: తమ కుమారుడు తూర్పు భరత్ సాయిరెడ్డి వివాహం ఈ నెల 25న జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జగ్గారెడ్డి, నిర్మల దంపతులు కుటుంబ సమేతంగా ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుమారుడు భరత్ సాయిరెడ్డిని వెంటబెట్టుకొని మొత్తం 16 ఆలయాల్లో వివాహ ఆహ్వాన పత్రికలు ఉంచి దేవుళ్ల ఆశీస్సులు కోరుకున్నారు. తొలుత రుద్రారంలోని ప్రసిద్ధ గణేష్ గడ్డ వినాయక ఆలయంలో తొలి వివాహ పత్రికను ఉంచి పూజలు నిర్వహించారు. అనంతరం సంగారెడ్డిలోని అస్తబల్ రేణుక ఎల్లమ్మ ఆలయం, నల్ల పోచమ్మ ఆలయం, సంగమేశ్వర ఆలయం, భవానీ మందిరం, మాణిక్ ప్రభు మందిరం, లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం, దుర్గమ్మ గుడి, ముత్యాలమ్మ గుడి, వడ్డె వీర హనుమాన్ మందిరం, శ్రీ వైకుంఠపురం ఆలయం, వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం, నవరత్నాలయం, ఎర్ర పోచమ్మ గుడి, రామ్‌నగర్ రామ్ మందిర్ తదితర ఆలయాలను సందర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా భరత్ సాయిరెడ్డి బ్రాహ్మణుల ఆశీర్వచనాలు తీసుకున్నారు. ఆలయాల సందర్శన అనంతరం రామ్‌నగర్‌లోని తమ నివాసానికి చేరుకున్న జగ్గారెడ్డి కుటుంబ సభ్యులు ఇంట్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తూర్పు భరత్ సాయిరెడ్డి తన తాత, నానమ్మ చిత్రపటానికి నమస్కరించి వారి ఫొటో వద్ద వివాహ ఆహ్వాన పత్రికను ఉంచారు. అనంతరం ఇంటి పూజా మందిరంలోని దేవతామూర్తులకు నమస్కరించి ప్రత్యేక పూజలు చేశారు. చివరగా తల్లిదండ్రుల పాదాలకు నమస్కరించి జగ్గారెడ్డి, నిర్మల దంపతుల ఆశీర్వాదాలు తీసుకున్నారు. కుటుంబ సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రాధాన్యతనిస్తూ వివాహ వేడుకలకు ముందుగా జగ్గారెడ్డి కుటుంబం ఆలయాల్లో పూజలు నిర్వహించడం విశేషంగా నిలిచింది.

చిట్యాలలో ఎఫ్‌పీవో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ప్రభుత్వ విప్ వేముల వీరేశం



చిట్యాల క్రైమ్ మిర్రర్: రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని, రైతులు దళారులను ఆశ్రయించి బయట మార్కెట్‌లో తక్కువ ధరకు ధాన్యం విక్రయించవద్దని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సూచించారు. చిట్యాల పట్టణంలో ఏర్పాటు చేసిన ఎఫ్‌పీవో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా కరువు పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కరువు పరిస్థితులను అధిగమించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. నకిరేకల్ నియోజ కవర్గంలో మూసీ జలాలతో గుండ్రాంపల్లి, సుంకనపల్లి, పెద్దకాపర్తి, వెలిమినేడు, ఉరుమడ్ల చెరువులను నింపుతున్నామని, బ్రాహ్మణవెల్లంల ఉదయ సముద్రం నుంచి నేరడ, నార్కెట్‌పల్లి పెద్ద చెరువులకు నీటిని అందించే ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. ధర్మారెడ్డి కాలువ పనులను డిసెంబర్‌లోగా పూర్తి చేస్తామని వెల్లడించారు. అలాగే కట్టంగూర్, నకిరేకల్, కేతేపల్లి మండలాల్లో కృష్ణా జలాలతో చెరువులను నింపి వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కరువు పరిస్థితుల్లో ప్రతిపక్షాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రభుత్వం రైతులకు, ప్రజలకు అండగా ఉంటూ ఉపాధి, అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పందిరి గీతా రమేష్ , కౌన్సిలర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు, కొనుగోలు కేంద్ర నిర్వాహకులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్దపీట

సమాజాన్ని మార్చగలిగే శక్తి విద్యకు మాత్రమే ఉంది

టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్

కూకట్ పల్లి, నవంబర్ 10 (క్రైమ్ మిర్రర్) : విద్యకు మాత్రమే సమాజాన్ని మార్చగలిగే శక్తి ఉందని అలాంటి విద్యకు రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. మహాత్మ జ్యోతిబాపూలే బిసి ఓవర్సీస్ విద్యా నిధి స్కీమ్ కింద రౌలకోల వంశీ విదేశీ విద్యకు అర్హత పొందాడు. మేరకు ప్రభుత్వం నుంచి నిధులు విడుదలయ్యాయి. సంబంధిత పత్రాన్ని మంగళవారం పార్టీ కార్యాలయంలో రమేష్ సదరు విద్యార్థికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యను చదవడం ద్వారా వ్యక్తిగత అభివృద్ధితోపాటు సమాజ అభివృద్ధి కూడా జరుగుతుందన్నారు. ప్రభుత్వ ఆర్థిక సాయంతో విదేశాలు వెళ్లి ఉన్నత చదువులు చదివిన వారు డబ్బు సంపాదించి తిరిగి మాతృదేశానికి రావాలని ఇక్కడ సేవలు అందించాలని, దేశ అభివృద్ధిలో పాలుపంచుకోవాలని విద్యార్థికి సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో పుష్ప రెడ్డి, నాగార్జున, శ్రీనివాస్ బాబు, మస్తాన్ రెడ్డి, క్రాంతి, లక్ష్మయ్య, బాలరాజు, రమణ, ఆసిఫ్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

కూకట్ పల్లి సిఐ స్వామి గౌడ్ కి దీపావళి శుభాకాంక్షలు తెలిపిన జనంపల్లి పురేందర్ రెడ్డి

కూకట్ పల్లి, నవంబర్ 10 (క్రైమ్ మిర్రర్) : శేరిలింగంపల్లి నియోజకవర్గం, వివేకానంద నగర్ డివిజన్ రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో దీపావళి పండుగ శుభ సందర్భంగా కూకట్ పల్లి సిఐ డీ స్వామి గౌడ్ ని, ఎస్ఐలు రవీందర్ రెడ్డి, చంద్రశేఖర్, నర్మదా ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానం చేసి మిఠాయి అందజేశారు. ఈ కార్యక్రమంలో వి తాండవ కృష్ణ, జి ప్రసాద్, చందుసాగర్, నాని కలిసి సిఐ కి అభినందనలు తెలిపారు. సిఐ స్వామి గౌడ్ మాట్లాడుతూ కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరిస్తూ ముందుకెళ్తున్నానని తెలిపారు. అధ్యక్షులు జె పురేందర్ రెడ్డి మాట్లాడుతూ పోలీసు అధికారులకు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరిస్తూ ఉంటారని తెలిపారు. పోలీసు అధికారులకు పేరుపేరునా దీపావళి పండుగ శుభ సందర్భంగా వారికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.



జాతీయ మహాసభల బహిరంగ సభ

చిట్యాల క్రైమ్ మిర్రర్: ఏఐకేఎస్ జాతీయ మహాసభల బహిరంగ సభకు యువతీ యువకులు అధిక సంఖ్యలో తరలిరావాలిసీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్, వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి అవిశెట్టి శంకరయ్య పిలుపు చిట్యాల అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) 36వ జాతీయ మహాసభల సందర్భంగా ఈ నెల 15వ తేదీన నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించే భారీ బహిరంగ సభకు యువతీ యువకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్, వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి అవిశెట్టి శంకరయ్య విజ్ఞప్తి చేశారు.మంగళవారం చిట్యాల మండల కేంద్రంలో నిర్వహించిన రెడ్ షర్ట్స్ వాలంటీర్ల కవాతు శిక్షణ కార్యక్రమంలో పాల్గొని వారు మాట్లాడారు. నల్లగొండలో నిర్వహించే భారీ బహిరంగ సభకు ముందు జరిగే ప్రదర్శనలో పది వేల మంది యువతీ యువకులతో రెడ్ షర్ట్స్ వాలంటీర్ల కవాతు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కవాతును క్రమశిక్షణతో, విజయవంతంగా నిర్వహించేందుకు యువతకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా రైతాంగ హక్కుల కోసం అనేక పోరాటాలు నిర్వహిస్తూ, రైతుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఉద్యమిస్తున్న అఖిల భారత కిసాన్ సభ 36వ జాతీయ మహాసభలను తొలిసారిగా నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించడం ఎంతో గర్వకారణమని అన్నారు. ఈ మహాసభలు రైతాంగ ఐక్యతకు, పోరాట స్ఫూర్తికి ప్రతీకగా నిలుస్తాయని పేర్కొన్నారు. రైతాంగ సమస్యలపై జరిగే ఈ మహాసభలకు యువత సంఘీభావంగా నిలవాలని, నవంబర్ 15న నిర్వహించే రెడ్ షర్ట్స్ వాలంటీర్ల భారీ కవాతుతో పాటు బహిరంగ సభలోనూ యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ చిట్యాల మండల కార్యదర్శి కూనూరు గణేష్, ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షులు అరూరి ప్రణీత్, డివైఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు కొంపెల్లి భరత్, మండల నాయకులు చంటి, జిట్ట హరీష్, సాయి, ఎం.డి. అదిల్, వంశీ, సిద్ధూ, అజిత్, శివ, నవీన్, రాజు తదితరులు పాల్గొన్నారు.



క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
బుధవారం 11-11-2026

వైద్య సేవలను మరింత మెరుగుపరచాలి: వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్

మంచిర్యాల జిల్లా అధికారులతో జూమ్ వీసీ ద్వారా సమీక్ష



మంచిర్యాల: నవంబర్ 10 (క్రైమ్ మిర్రర్) : ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ జిల్లా వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి వివిధ జిల్లాల వైద్యాధికారులు, కార్యక్రమాల సంచాలకులతో ఆయన జూమ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వైద్య సేవల తీరుపై సమీక్షించారు. ఆరోగ్య కార్యక్రమాల పురోగతిని పర్యవేక్షించేందుకు ప్రతి మంగళవారం ఈ సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

మాతాశిశు సంరక్షణ, టీకాలపై ప్రత్యేక దృష్టి: గర్భిణుల నమోదు, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు మరియు మాతాశిశు సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కమిషనర్ సూచించారు. ప్రతి బుధ, శనివారాల్లో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించి, అవసరమైన అన్ని రకాల టీకాలను నిల్వ అందుబాటులో ఉంచాలన్నారు. బీపీ, మధుమేహం, క్యాన్సర్ వంటి అసంక్రమణ వ్యాధులను ముందుగానే గుర్తించి బాధితులకు త్వరితగతిన వైద్యం అందించాలని స్పష్టం చేశారు. అలాగే సీజనల్ వ్యాధులు, కీటక జనిత వ్యాధుల నియంత్రణకు వైద్య సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

డిజిటల్ సేవలు, అత్యవసర వైద్యం అందుబాటులో ఉంచాలి:

ఈ-సంజీవని, టెలి-మానస్, ఈ-ఔషధి వంటి డిజిటల్ వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని కోరారు. క్షయ (టిబి) వ్యాధిగ్రస్తులకు ఉచిత మందులతో పాటు పోషకాహార కిట్లు క్రమం తప్పకుండా అందించాలన్నారు. ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేయడంతో పాటు కుక్కకాటు, పాముకాటు బాధితులకు అవసరమైన యాంటీ రెబీస్ టీకాలు, అత్యవసర మందులు ప్రతి ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు.ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచేందుకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాలని, లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టాన్ని జిల్లాలో కఠినంగా అమలు చేయాలని ఆదేశించారు.అంతేకాకుండా వైద్య సిబ్బంది విధిగా 'మీ ప్రణామం' యాప్ ద్వారా హాజరు నమోదు చేసుకోవాలని ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మంచిర్యాల ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు డాక్టర్ సుధాకర్ నాయక్, డాక్టర్ అరుణశ్రీ, డాక్టర్ అనిల్ కుమార్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, కంటి ప్రోగ్రామ్ అధికారి శ్రీశంకర్, ఫార్మసీ అధికారి శ్రీనివాస్, జిల్లా ఆరోగ్య బృందం ప్రతినిధులు ఆర్.ఎస్. పద్మ, కాకిరాల వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, సుమన్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి నగర్ వన్ కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చొరవ

- రూ.18.70 లక్షల వ్యయంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన
- సమస్య రహిత కాలనీలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- పీఏసీ చైర్మన్, శేర్లింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ





కూకట్ పల్లి, నవంబర్ 10 (క్రైమ్ మిర్రర్) : శేరిలింగంపల్లి నియోజకవర్గం, వెంకటేశ్వర నగర్ డివిజన్ పరిధిలోని ప్రగతి నగర్ 1 కాలనీలో రూ.18 లక్షల 70 వేల రూపాయల అంచనావ్యయంతో నూతనంగా చేపట్టబోయే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ(యూజీడీ) పైప్ లైన్ నిర్మాణం పనులకు, మంచి నీటి పైప్ లైన్ నిర్మాణం పనులకు జలమండలి అధికారులు, ప్రగతి నగర్ 1 వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో కలిసి పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పి ఎస్ సి చైర్మన్ గాంధీ మాట్లాడుతూ భూగర్భ డ్రైనేజి సమస్య పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నాం అని, పలు కాలనీ లలో ప్రజల నుండి వచ్చిన వినతి మెరకు మా దృష్టికి వచ్చిన సమస్యలను పరిగణలోకి తీసుకొని ప్రత్యేక చొరవ తో మంగళవారం ప్రగతి నగర్ కాలనీలో రూ. 18 లక్షల 70 వేల రూపాయల అంచనావ్యయంతో నూతనంగా చేపట్టబోయే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ(యూజీడీ) పైప్ లైన్ నిర్మాణం పనులకు, మంచి నీటి పైప్ లైన్ నిర్మాణం పనులకు శంకుస్థాపన చేసుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని తెలియచేసారు. అత్యవసరం ఉన్న చోట, నిత్యం పొంగుతున్న ప్రాంతలలోప్రథమ ప్రాధాన్యత గా పనులు పూర్తి చేస్తామని అన్నారు. ఏ చిన్న సమస్య అయిన నా దృష్టికి వచ్చిన తప్పకుండా పరిష్కరిస్తామని, కాలనీ లలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ, కాలనీలను అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళుతు సమస్య రహిత ఆదర్శవంతమైన కాలనీ లు గా తీర్చిదిద్దడమే లక్ష్యం అని అన్నారు. కాలనీలలో గల ఎన్నో ఏండ్ల సమస్య నేటి తో తిరునని, నిత్యం పొంగుతుండటం వలన కాలనీ వాసులు ,ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వాటిని దృష్టిలో పెట్టుకొని నూతన పైపు నిర్మాణం శంకుస్థాపన చేయడం జరిగిందని అన్నారు.ప్రతి కాలనీ లో స్వచ్ఛమైన మంచి నీటి పైప్ లైన్ నిర్మాణం చేపట్టడం ద్వారా కాలనీ వాసులకు, ప్రజలకు, స్వచైమన మంచి నీరు అందుతుందని అన్నారు. మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని, యూజీడీ పైప్ లైన్, మంచి నీటి పైప్ లైన్ వంటి అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని ,నాణ్యత విషయంలో ఎక్కడ రాజి పడకూడదని, ప్రజలకు స్వచ్ఛమైన, చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కలిపిస్తామని హామీ ఇచ్చారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరిత గతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన అధికారులకు సూచించారు. నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని, అన్నివేళలో ప్రజలకు అందుబాటులోకి ఉంటానని, మెరుగైన ప్రజా జీవనానికి అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని ,నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని, అదేవిధంగా సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకం లో శేరిలింగంపల్లి నియోకజకర్గంను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన, అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదితానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం. సంతోష్, జనరల్ మేనేజర్ హరిశంకర్, డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.వి.ఎన్. శ్రీనివాస రాజు, మేనేజర్ ఆర్. అనిల్ కుమార్, నాయినేని చంద్రకాంతరావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మందుల శివకుమార్, ప్రగతి నగర్ 1 వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మాచర్ల విష్ణు, ప్రధాన కార్యదర్శి రఘుగౌడ్, కోశాధికారి ఎస్ శంకర్ రావు, ఎల్లం నాయుడు, శ్రీరాముల వెంకటేష్, వాణి, అనిత తదితరులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, అసోసియేషన్ సభ్యులు, స్థానిక వాసులు పాల్గొన్నారు.



వార్డు మెంబర్స్ ఫోరం మండల అధ్యక్షుడిగా డి. నవీన్ కుమార్ ఎన్నిక

హత్నూర, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి నవంబర్ 10: నాగబెల్లి జ్యోతి మహేష్ ఆదేశాల మేరకు సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కలివేముల శివకుమార్, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి సత్తారం ప్రవీణ్ ఆధ్వర్యంలో హత్నూర్ మండల వార్డు మెంబర్స్ ఫోరం నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వివిధ పదవులకు సభ్యులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

మండల అధ్యక్షుడు: డి. నవీన్ కుమార్
ఉపాధ్యక్షులు: శ్రీకాంత్, సంపత్, రాజశేఖర్, అమీన్‌ఉద్దీన్, నర్సింలు
వర్కింగ్ ప్రెసిడెంట్: ఎం.డి. గౌస్
సెక్రటరీలు: జి. శివకుమార్, ఎం. గణేష్
జాయింట్ సెక్రటరీలు: జె. అశోక్, పి. సరిత ప్రసాద్, ఎం. భాను చందర్
గౌరవ అధ్యక్షుడు: ఆర్. కృష్ణ గౌడ్
కోశాధికారి: బి. పెంటేష్
ఆర్గనైజింగ్ సెక్రటరీలు: దేవేందర్, డి. సుధాకర్
అధికార ప్రతినిధి: సూకరాజు, **సోషల్ మీడియా ఇన్‌చార్జి:** పి. రవి

గౌరవ సలహాదారులు: కూతుబొద్దీన్, వి. వీరాస్వామి. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు వార్డు సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములవుతూ వార్డు సభ్యుల హక్కులు, సమస్యలపై ఐక్యంగా పోరాడాలని నాయకులు ఆకాంక్షించారు. నూతన కమిటీ ఏర్పాటు పట్ల పలువురు హర్షం వ్యక్తం చేసి ఎన్నికైన సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం





గండిపేట(క్రైమ్ మిర్రర్): విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇంట్లో ఒక్కసారిగా మంటలు చెలరేగి ఇల్లు పూర్తిగా దగ్ధమైన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హైదర్‌షాకోట్ శివసాయినగర్ ఫేజ్-2లో చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఇంట్లోని సామగ్రి, విలువైన వస్తువులన్నీ అగ్నికి ఆహుతి కావడంతో భారీగా ఆస్తి నష్టం సంభవించింది. శివసాయినగర్ ఫేజ్-2లో నివాసం ఉంటున్న ఓ కుటుంబం ఇంట్లో ఫ్రిజ్ వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. ఈ క్రమంలో వాటర్ ప్యూరిఫైయర్ పేలినట్లు సమాచారం. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి క్షణాల్లోనే ఇంటి అంతటా వ్యాపించాయి. ఇంట్లోని ఫర్నిచర్, ఎలక్ట్రానిక్ వస్తువులు, దుస్తులు, ఇతర గృహోపకరణాలు మంటలకు పూర్తిగా కాలిపోయాయి. ప్రమాదం జరిగిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రాణనష్టం తప్పింది. ఇంటి యజమాని భార్య తన కుమార్తెను పాఠశాలలో దింపేందుకు వెళ్లగా, భర్త సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కావడంతో విధులకు వెళ్లారు. ఈ సమయంలో ఇంటి నుంచి పొగలు, మంటలు రావడాన్ని గమనించిన పక్కింటి వారు వెంటనే కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న భర్త హుటాహుటిన ఇంటికి చేరుకున్నారు. అయితే అప్పటికే మంటలు ఇంటి మొత్తానికి వ్యాపించి ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. కళ్లముందే తమ ఇల్లు, జీవితకాలం కష్టపడి సమకూర్చుకున్న వస్తువులు బూడిద కావడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఇంట్లోని వస్తువులన్నీ కాలిపోవడంతో కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో పడింది. ఈ అగ్నిప్రమాదంలో భారీగా ఆస్తి నష్టం వాటిల్లడంతో బాధిత కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఉంది. ఒక్కసారిగా జరిగిన ప్రమాదంతో తమకు నిలువ నీడ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి అగ్నిప్రమాదంలో నష్టపోయిన తమ కుటుంబాన్ని ఆదుకోవాలని, తగిన ఆర్థిక సహాయం అందించాలని బాధితులు వేడుకుంటున్నారు.




ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సాధు ప్రతాప్ రెడ్డి

కూకట్ పల్లి, నవంబర్ 10 (క్రైమ్ మిర్రర్) : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. జన్మదినాన్ని పురస్కరించుకొని, కొండంగల్‌లోని ఆయన నివాసానికి కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సాధు ప్రతాప్ రెడ్డి తరలి ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సాధు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని ప్రజా పాలన పేరుతో ప్రజలకు సేవలందిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలను దృష్టిలో పెట్టుకొని వారికి సంక్షేమ ఫలాలను అందించడంలో ముందుందని అన్నారు. ఇలాంటి ముఖ్యమంత్రి నిత్యం ప్రజాసేవలో ఉంటూ తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారు అని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ భగవంతుని వేడుకున్నట్లు సాదు ప్రతాపరెడ్డి తెలిపారు.

మహిళల స్వయం ఉపాధికి భీమారంలో ఉచిత శిక్షణ

సర్పంచ్ సొంత ఖర్చులతో భవనం ఏర్పాటు; గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో తరగతులు



భీమారం, నవంబర్ 10 (క్రైమ్ మిర్రర్): మహిళలు స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా ఎదిగేందుకు భీమారం మండల కేంద్రంలో ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ ఉస్కామల్ల విజయలక్ష్మి--పున్నం చందు దంపతుల చొరవతో గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.మహిళలకు శిక్షణ పొందేందుకు దూర ప్రాంతాలకు వెళ్లే ఇబ్బంది లేకుండా శ్రీరాంపూర్ వద్ద తరగతులు నిర్వహించేందుకు సర్పంచ్ దంపతులు సొంత ఖర్చులతో గదిని అద్దెకు తీసుకున్నారు. ఇందులో జ్యూట్ బ్యాగ్స్ తయారీ, పుట్టగొడుగుల పెంపకం, కుట్టుపనిలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. శిక్షణకు వచ్చే మహిళలకు మధ్యాహ్న భోజనం కూడా అందిస్తున్నారు. శిక్షకులు రమాదేవి, సంపత్ మహిళలకు పనిలో మెళకువలు నేర్పిస్తున్నారు.భీమారం మండలంలోని మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి పొందాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో కాజిపల్లి సర్పంచ్, జ్యోతి రెడ్డి, లక్ష్మి, శిక్షణకు వచ్చిన మహిళలు పాల్గొన్నారు.

బెల్టు షాపులు నిర్వహిస్తే ఉపేక్షించేది లేదు! : సర్పంచ్ రమాదేవి

కుటుంబాల సంక్షేమం దృష్టిలో పెట్టుకొని మునుగోడులో బెల్టు బంద్

నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.50 వేల నుంచి లక్ష రూపాయల వరకు జరిమానా





మునుగోడు క్రైమ్ మిర్రర్, (అక్టోబర్ 10): గ్రామంలో అక్రమంగా బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని మునుగోడు గ్రామ సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహ గౌడ్ హెచ్చరించారు. మునుగోడు గ్రామపంచాయతీ పరిధిలో బెల్టు షాపుల నిర్వహణను పూర్తిగా నిషేధించే దిశగా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో గ్రామంలో దండోరా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో ఎక్కడైనా బెల్టు షాపులు నిర్వహించినట్లు గుర్తిస్తే రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు.గ్రామంలో అక్రమ మద్యం విక్రయాలకు తావులేదు.. బెల్టు షాపుల పేరుతో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు అని హెచ్చరించారు. యువత భవిష్యత్తును, కుటుంబాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని బెల్టు షాపుల నిషేధానికి గ్రామస్తులందరూ సహకరించాలని కోరారు. గ్రామపంచాయతీ విధించిన నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలు అతిక్రమించే వారిపై జరిమానాలతో పాటు నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహ గౌడ్ స్పష్టం చేశారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
6 బుధవారం 11-11-2026



ఐలయ్యకు గౌరవ డాక్టరేట్

ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో: ప్రముఖ రచయిత, కవి, జర్నలిస్ట్,విశ్రాంతోపా ధ్యాయుడు పంజాల ఐలయ్య కు గౌరవ డాక్టరేట్ లభించింది. ఆదివారం గ్లోబల్ హ్యూమన్ రైట్స్ ట్రస్ట్ ద్వారా హైదరాబాద్ ఓ ప్రైవేట్ హోటల్లో ఏర్పాటుచేసిన వెబ్బిక్ యూనివ ర్సిటీ కాన్వకేషన్ లో ఆయనకు ఈ డాక్టరేట్ ప్రదానం చేశారు. విజ్ఞాన విద్య,సా మాజిక అభివృద్ధిలో గత 35 ఏళ్లుగా ఆయన చేసిన విశేష సేవలను వెబ్బిక్ యూనివర్సిటీ గుర్తించింది. తరగతి గది బోధనకే పరిమితం కాకుండా సామాజిక విద్య, పర్యావరణం పరిర క్షణ కార్యక్రమాల్లో ఐలయ్య చురుకుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హర్యానా హిమాచల్ ప్రదేశ్ మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలచార్యులు, రామకృష్ణ ఉప్పల శ్రీనివాస్ గుప్తా చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్ ను అందించారు. పంజాల ఐలయ్యకు గౌరవ డాక్టరేట్ లభించడం పట్ల పలువురు ఉపా ధ్యాయులు, కవులు, కళాకారులు ఐలయ్యను అభినందించారు.

కనెక్టివిటీ రోడ్డు ప్రారంభంతో పంచవతి కాలనీవాసులకు ఊరట

ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపిన స్థానికులు



గండిపేట(క్రైమ్ మిర్రర్): మణికొండ డివిజన్ పరిధిలోని ట్రయల్స్‌కు ఎదురుగా ఉన్న కనెక్టివిటీ రోడ్డును ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్‌కు పంచవతి కాలనీ వాసులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న రోడ్డు సౌకర్యం అందుబాటులోకి రావడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కనెక్టివిటీ రోడ్డు అందుబాటులోకి రావడం వల్ల పంచవతి కాలనీతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయని కాలనీవాసులు పేర్కొన్నారు. ముఖ్యంగా రోజువారీ ప్రయాణాలు, ఉద్యోగులు, విద్యార్థులు, స్థానిక నివాసితులకు ఈ రహదారి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. రవాణా సౌకర్యం మెరుగుపడటంతో సమయం ఆదా కావడంతో పాటు ప్రయాణ ఇబ్బందులు తగ్గనున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ.. ప్రజల అవసరాలను గుర్తించి కనెక్టివిటీ రోడ్డును అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని అన్నారు. ఇదే విధంగా మణికొండ డివిజన్‌లో ఇంకా పెండింగ్‌లో ఉన్న పలు రోడ్ల అభివృద్ధి పనులపై కూడా ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కాలనీల అభివృద్ధికి రహదారులు, డ్రైనేజీ, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాలు ఎంతో కీలకమని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని కోరారు. అభివృద్ధి పనులు నిరంతరంగా కొనసాగినప్పుడే నివాస ప్రాంతాలు మరింత సౌకర్యవంతంగా మారుతాయని కాలనీవాసులు అభిప్రాయపడ్డారు. కనెక్టివిటీ రోడ్డు అందుబాటులోకి రావడంతో పంచవతి కాలనీలో సంతోషం వ్యక్తమవుతుండగా, మిగిలిన అభివృద్ధి పనులు కూడా త్వరలో పూర్తవుతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి, నార్సింగ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏర్పుల కుమార్, శ్రావణ్ కుమార్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు

కెపిహెచ్బి భూములను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేయడం దారుణం

మల్కాజ్ గిరి పార్లమెంట్ సభ్యులు రాజేందర్

ప్రభుత్వ భూములను వేలం వేస్తే చూస్తూ ఊరుకోం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు



కూకట్ పల్లి, నవంబర్ 10 (క్రైమ్ మిర్రర్) : కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని కెపిహెచ్బి భూములను వేలం వేయొద్దని, కూకట్‌పల్లి హుడా ట్రక్ పార్క్‌కు సంబంధించిన ప్రభుత్వ భూములను విక్రయించవద్దని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన భారీ నిరసన కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ నిరసన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ విచ్చేసి ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, కూకట్ పల్లి నియోజకవర్గ బిజెపి నాయకులు కార్యకర్తలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు తమ ప్రాంతంలోని ప్రభుత్వ భూముల వేలం ప్రతిపాదనపై ఎదుర్కొంటున్న ఆందోళనలను, సమస్యలను ఎంపీ ఈటల రాజేందర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు సమర్పించిన వినతిపత్రాలను ఆయన స్వీకరించి, వారి సమస్యలను సావధానంగా విన్నారు. అనంతరం ఈటల రాజేందర్ మాట్లాడుతూ కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు ఏర్పాటు చేసిన సమయంలోనే ఈ ప్రాంత ప్రజల అవసరాలను, భవిష్యత్తు తరాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని కొంత భూమిని పార్కులు, క్రీడా మైదానాలు, ఇతర ప్రజోపయోగ సదుపాయాల కోసం ఎమినిటీస్ స్థలాలుగా కేటాయించడం జరిగిందని గుర్తుచేశారు. అలాగే కూకట్ పల్లికి సంబంధించి ఆనాడు పట్టణ శివారు ప్రాంతంగా గుర్తించి రైతుల దగ్గర నుంచి భూమిని స్వీకరించి ట్రక్ పార్కింగ్ కోసం ఆ రోజు ఈ స్థలాన్ని కేటాయించారు. మరి ఇప్పుడు ఈ ప్రభుత్వం ప్రజా అవసరాలను దృష్టిలో పెట్టుకోకుండా కేవలం వారి అవసరాలనే దృష్టిలో ఉంచుకొని భూములను వేలం వెయ్యడం సరికాదని వారు గుర్తు చేశారు. ఇప్పటికే కూకట్‌పల్లి వంటి అత్యంత రద్దీ ప్రాంతంలో జనాభా రోజురోజుకూ పెరుగుతూ ప్రజలు అనేక సమస్యలు, ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజా అవసరాల కోసం అందుబాటులో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేయడం అత్యంత దారుణమని అభిప్రాయపడ్డారు. భవిష్యత్తు తరాల పిల్లల కోసం పార్కులు, క్రీడా మైదానాలు ఏర్పాటు చేయడంతో పాటు, ప్రజలు స్వచ్ఛమైన గాలిని పీల్చుకునేలా పచ్చదనంతో కూడిన ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని వారు స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాల్సిన ప్రభుత్వం, విలువైన ప్రభుత్వ భూములను విక్రయించి ఆదాయం సమకూర్చుకోవాలనే ఆలోచన చేయడం సరికాదని ఈటల రాజేందర్ అన్నారు. అనంతరం వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడే ప్రభుత్వ ఆస్తులను విక్రయించి లబ్ధి పొందాలనే ధోరణిని ప్రభుత్వం ప్రదర్శిస్తోందంటూ విమర్శించారు. ప్రజల అవసరాలు, భవిష్యత్తు తరాల ప్రయోజనాలను పక్కనపెట్టి వారి ఇష్టం వచ్చినట్టు ప్రజలు తీసుకునే ఇటువంటి నిర్ణయాలను ప్రజలు సహించరని, ప్రజలే తగిన సమయంలో తమ అభిప్రాయాన్ని స్పష్టంగా తెలియజేస్తారని, ఎట్టి పరిస్థితుల్లోనూ కెపిహెచ్బి ప్రభుత్వ భూములు, కూకట్‌పల్లి హుడా ట్రక్ పార్క్ భూముల వేలం ప్రక్రియను నిలిపివేయాలని, ప్రభుత్వం తన నిర్ణయాన్ని తక్షణమే మార్చుకొని ఆ భూములను పూర్తిగా ప్రజా అవసరాలకే కేటాయించాలని వడ్డేపల్లి రాజేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.


ఈ కార్యక్రమంలో మల్కాజ్గిరి జిల్లా బిజెపి అధ్యక్షులు గిరి వర్ధన్ రెడ్డి, నిజామాబాద్ జిల్లా ఇన్చార్జ్ మాధవరం కాంతారావు, మూసాపేట్ డివి జన్ మాజీ కార్పొరేటర్ కోడిచెర్ల మహేందర్, బీజేపీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ భూముల పరిరక్షణకు తమ సంఘీభావాన్ని తెలియజేశారు.

ముందస్తు ప్రణాళికలతో తాగునీటి ఎద్దడికి అడ్డుకట్ట: అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య

మందమర్రి మండలంలో విస్తృతంగా క్షేత్రస్థాయి పరిశీలన

అభివృద్ధి పనుల్లో నాణ్యతే ప్రథమ ప్రాధాన్యం

మంచినీటి వనరుల సంరక్షణలో ప్రజలను భాగస్వామ్యం చేయాలి





మంచిర్యాల,నవంబర్ 10 (క్రైమ్ మిర్రర్): జిల్లాలో ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి పనులను ఎక్కడా రాజీ పడకుండా, పూర్తి నాణ్యతా ప్రమాణాలతో సకాలంలో పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అధికారులను స్పష్టంగా ఆదేశించారు. మంగళవారం ఆయన మందమర్రి మండలంలోని సారంగపల్లి, ఆదిలపేట, పొన్నారం గ్రామపంచాయతీల పరిధిలో విస్తృతంగా పర్యటించారు. క్షేత్రస్థాయిలో కొనసాగుతున్న వి.బి.జి.రామ్.జి. పథకం పనులను పరిశీలించడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న సంక్షేమ కార్యక్రమాలను పరిశీలించారు.

పనుల పురోగతిపై ఆరా..

సందర్యంలో భాగంగా సారంగపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న మురుగు కాలువలు, ఇంకుడు గుంతలు, కమ్యూనిటీ సోక్ పిట్లతో పాటు సి.సి. వర్క్‌సైట్ పనులను అదనపు కలెక్టర్ పరిశీలించారు. అలాగే ఆదిలపేట గ్రామపంచాయతీలోని పి.టి. వర్క్‌సైట్‌ను కూడా పరిశీలించి, పనుల నాణ్యతపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎక్కడా లోపాలు తలెత్తకుండా పనులు వేగవంతం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

సంక్షేమ పథకాల అమలు తీరు పరిశీలన..

గ్రామాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు అర్హులందరికీ అందుతున్నాయా లేదా అని ఆయన ఆరా తీశారు. ఆసరా పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల పంపిణీ తీరును పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న అల్పాహారం, మధ్యాహ్న భోజన పథకాల నాణ్యతను స్వయంగా తనిఖీ చేశారు. అర్హులైన ప్రజలందరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ బడులకు పంపకుండా ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి నాణ్యమైన విద్యను అందించాలని అవగాహన కల్పించారు.

ఎల్‌నినో ముప్పు దృష్ట్యా నీటి సంరక్షణే ముఖ్యం..

రానున్న రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు, కరువు ముప్పు ఏర్పడే అవకాశాలు ఉన్నాయని, ఈ నేపథ్యంలో అధికారులు ముందస్తుగా అప్రమత్తం కావాలని అదనపు కలెక్టర్ హెచ్చరించారు. మూడు గ్రామపంచాయతీల పరిధిలో జరుగుతున్న ఇంకుడు గుంతల నిర్మాణం, రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ రీఛార్జ్ స్ట్రక్చర్లు, బోర్‌వెల్ రీఛార్జ్ స్ట్రక్చర్ల పనులను నిశితంగా పరిశీలించారు. గ్రామాల్లో తాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందుగానే పకడ్బందీ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. భూగర్భ జలాల పెంపునకు చేపట్టే పనుల్లో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు.అలాగే, గ్రామాలలోని వి.ఓ. భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి వాటి పనితీరును సమీక్షించారు. చిన్నారులు, గర్భిణులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా శాఖల ఏఈలు, ఉపాధి హామీ ఏపీఓ, ఈసీ, టీఏ, పంచాయతీ కార్యదర్శులు, ఆయా గ్రామాల సర్పంచులు మరియు సంబంధిత శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మారిన టీఎన్జిఓఎస్ కాలనీ రహదారి

మట్టి కుప్పలు, బండరాళ్లతో ప్రజలకు ఇబ్బందులు

వెంటనే తొలగించి రోడ్డును అందుబాటులోకి తేవాలి

టీడీపీ నాయకుడు ఉస్మెమూరి విజయ్ కుమార్ నేత



గండిపేట(క్రైమ్ మిర్రర్): మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని టీ.ఎన్.జి.ఓ.ఎస్ కాలనీలో రహదారి సమస్యపై సంబంధిత జీహెచ్ఎంసీ అధికారులు తక్షణమే స్పందించాలని టీడీపీ సీనియర్ నాయకుడు ఉస్మెమూరి విజయ్ కుమార్ నేత కోరారు. కాలనీలో పేరుకుపోయిన మట్టి కుప్పలు, భారీ బండరాళ్ల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన టీ.ఎన్.జి.ఓ.ఎస్ కాలనీలో పర్యటించి స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించారు. కాలనీలోని ప్రభుత్వ పాఠశాల సమీపం నుంచి సాయిబాబా గుడి వరకు ఉన్న 40 అడుగుల రహదారిపై పెద్దఎత్తున మట్టి కుప్పలు, భారీ బండరాళ్లు పేరుకుపోయి ఉండటాన్ని గుర్తించారు. వీటితో రహదారి వినియోగానికి తీవ్ర అంతరాయం కలుగుతోందని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ.. రహదారిపై పేరుకుపోయిన మట్టి కుప్పలు, బండరాళ్ల మధ్య విషసర్పాలు, విషపురుగులు చేరే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు, కార్లలో ప్రయాణించే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే చిన్నారులు ఈ రహదారిపై నడిచే సమయంలో ఇబ్బందులు పడుతున్నారని, మట్టి కుప్పలు, బండరాళ్ల కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. పాఠశాల విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సంబంధిత జీహెచ్ఎంసీ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రహదారిపై పేరుకుపోయిన మట్టి కుప్పలు, బండరాళ్లను తొలగించాలని, రహదారిని పూర్తిస్థాయిలో శుభ్రం చేసి ప్రజలకు సురక్షితంగా అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు నిత్యం వినియోగించే రహదారుల విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ సమస్యను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని ఆయన కోరారు. ప్రజల సమస్యలు పరిష్కారమయ్యే వరకు తమ పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో బస్తీ పెద్దలతో పాటు టీడీపీ సీనియర్ నాయకులు యు. విజయ్ కుమార్, పి. రవి, పి. వెంకటేష్ రాజు తదితరులు పాల్గొన్నారు.



వడ్డేపల్లిలో జోరందుకున్న కూరగాయల అంగడి

రెండో వారంలోనూ పెరిగిన సందడి

కూరగాయలతో పాటు మాంసాహారం, చిరుతిళ్ల అమ్మకాలు

చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు అందుబాటులోకి నిత్యావసర సరుకులు



హత్నూర, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, నవంబర్ 10: వడ్డేపల్లి చౌరస్తాలో ప్రతి మంగళవారం నిర్వహిస్తున్న వారపు కూరగాయల అంగడి రెండో వారంలోనూ జోరందుకుంది. మంగళవారం అంగడి కు చుట్టుపక్కల గ్రామాల నుంచి రైతులు, వ్యాపారులు, కొనుగోలుదారులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో బీరప్ప దేవాలయ ఆవరణ సందడిగా మారింది. మొదటి వారంతో పోలిస్తే రెండో వారంలో కొనుగోలుదారుల సంఖ్య పెరగడంతో వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అంగడిలో టమాటా, ఉల్లిగడ్డ, పచ్చిమిర్చి, వంకాయ, బెండకాయ, దొండకాయ, బీరకాయ, వివిధ రకాల ఆకుకూరలతో పాటు నిత్యావసర కూరగాయలు విక్రయానికి అందుబాటులో ఉంచారు. వీటితో పాటు మటన్, చికెన్, చేపల విక్రయాలు కూడా కొనసాగాయి. చిన్నారులు, పెద్దలను ఆకట్టుకునేలా మిర్చి బజ్జీలు, పునుగులు, సమోసాలు, పానీపూరి వంటి చిరుతిళ్ల దుకాణాలు సైతం ఏర్పాటు చేశారు. దీంతో అంగడికి వచ్చిన ప్రజలు కూరగాయలు, మాంసాహార ఉత్పత్తులతో పాటు తమకు కావాల్సిన తినుబండారాలను కొనుగోలు చేస్తూ సందడి చేశారు.

అన్ని సౌకర్యాలు ఒకేచోట..

వడ్డేపల్లి చౌరస్తాలోని బీరప్ప దేవాలయ ఆవరణలో అంగడి నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా మారింది. చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు సులభంగా చేరుకునే వీలుండటంతో పాటు, అంగడి ప్రాంతంలో ట్రాఫిక్‌కు పెద్దగా అంతరాయం కలగకపోవడం మరో ప్రత్యేకతగా నిలుస్తోంది. వడ్డేపల్లి చౌరస్తాలో ఇప్పటికే మెడికల్ షాప్, కిరానషాప్, స్వీట్ హౌస్‌లు, టిఫిన్ సెంటర్లు, కల్లు దుకాణాలు, వైన్ షాప్, టీ పాయింట్లు, డాబాలు అందుబాటులో ఉండటంతో అంగడికి వచ్చే ప్రజలకు అదనపు సౌకర్యాలు కలుగుతున్నాయి. ఒకే ప్రాంతంలో నిత్యావసర కొనుగోళ్లతో పాటు ఇతర అవసరాలు తీర్చుకునే అవకాశం ఉండటంతో వడ్డేపల్లి అంగడికి ప్రాధాన్యత పెరుగుతోంది.

రైతులకు, చిరు వ్యాపారులకు ఉపాధి వేదిక..

వారపు అంగడి ఏర్పాటు కావడంతో స్థానిక రైతులు తమ పంటలను నేరుగా వినియోగదారులకు విక్రయించుకునే అవకాశం లభిస్తోంది. మధ్యవర్తుల ప్రమేయం తగ్గడంతో రైతులకు ప్రయోజనం చేకూరడంతో పాటు ప్రజలకు కూడా తమ ప్రాంతంలోనే కూరగాయలు కొనుగోలు చేసే సౌకర్యం కలుగుతోంది. చిన్న వ్యాపారులు, చిరు వ్యాపారులకు సైతం ఈ అంగడి ఉపాధి కల్పించే వేదికగా మారుతోంది.

మార్కెట్ అభివృద్ధిపై స్థానికుల ఆశాభావం..

ప్రతి మంగళవారం క్రమం తప్పకుండా అంగడి నిర్వహిస్తుండటంతో వడ్డేపల్లి పరిసర గ్రామాల ప్రజలకు ఎంతో అనుకూలంగా మారుతోంది. రెండో వారంలోనే అంగడికి మంచి స్పందన లభించడం విశేషం. రానున్న రోజుల్లో మరిన్ని దుకాణాలు, వ్యాపారులు చేరి అంగడికి మరింత విస్తరించే అవకాశం ఉందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అంగడికి వచ్చే వ్యాపారులు, కొనుగోలుదారులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తే వడ్డేపల్లి వారపు అంగడి మరింత అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడుతున్నారు.




నో బిన్ -- నో ట్రేడ్‌పై మున్సిపల్ అధికారుల కొరడా

నార్సింగి సర్కిల్ పరిధిలో విస్తృత తనిఖీలు

గండిపేట(క్రైమ్ మిర్రర్): పట్టణ పరిశుభ్రతను కాపాడటంతో పాటు వ్యర్థాల నిర్వహణను క్రమబద్ధీకరించే లక్ష్యంతో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని నార్సింగి సర్కిల్-45 అధికారులు 'నో బిన్ -- నో ట్రేడ్' కార్యక్రమాన్ని ముమ్మరంగా అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా 126వ వార్డు గండిపేట పరిధిలోని పలు గ్రామాల్లో వ్యాపార సముదాయాలపై విస్తృత తనిఖీలు నిర్వహించారు. 126వ వార్డులోని జన్వాడ, మిజ్జగూడ, గౌలిదొడ్డి గ్రామాల్లో అధికారులు పర్యటించి దుకాణాలు, వ్యాపార సంస్థలను క్షుణ్ణంగా పరిశీలించారు. వ్యాపార సముదాయాల వద్ద చెత్త నిర్వహణకు అవసరమైన డస్ట్‌బిన్లు ఏర్పాటు చేశారా? తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరిస్తున్నారా? దుకాణాల పరిసరాల్లో పరిశుభ్రత పాటిస్తున్నారా? అనే అంశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు వ్యాపారులకు పలు సూచనలు చేశారు. ప్రతి దుకాణదారుడు తప్పనిసరిగా డస్ట్‌బిన్ ఏర్పాటు చేసుకోవాలని, తడి చెత్తను, పొడి చెత్తను కలపకుండా వేర్వేరుగా సేకరించాలని స్పష్టం చేశారు. దుకాణాల్లో ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను రోడ్లపై, బహిరంగ ప్రదేశాల్లో పడేయకుండా నిర్దేశిత పద్ధతిలో పారవేయాలని సూచించారు. నో బిన్ -- నో ట్రేడ్ నిబంధనలను పాటించని వ్యాపార సంస్థలపై అధికారులు చర్యలు చేపట్టారు. తనిఖీల్లో నిబంధనల ఉల్లంఘన గుర్తించిన వ్యాపారులకు మొత్తం రూ.3,200 జరిమానా విధించారు. ఇకపై నిబంధనలను ఉల్లంఘిస్తే జరిమానాలతో పాటు నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరిశుభ్రమైన పరిసరాలు కేవలం మున్సిపల్ సిబ్బంది బాధ్యత మాత్రమే కాదని, వ్యాపారులు, స్థానిక ప్రజలు కూడా తమవంతు బాధ్యతగా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు సూచించారు. ప్రతి దుకాణం వద్ద డస్ట్‌బిన్ ఏర్పాటు చేయడం, చెత్తను వేరు చేయడం వంటి చిన్నపాటి చర్యలతో పరిసరాల పరిశుభ్రతను గణనీయంగా మెరుగుపరచవచ్చని పేర్కొన్నారు. నార్సింగి సర్కిల్ పరిధిలో చెత్త నిర్వహణను మరింత సమర్థవంతంగా అమలు చేయడం, రోడ్లు మరియు బహిరంగ ప్రదేశాల్లో చెత్త పేరుకుపోకుండా చూడటం, ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించడం లక్ష్యంగా 'నో బిన్ -- నో ట్రేడ్' కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగించనున్నట్లు అధికారులు తెలిపారు.

బీఆర్ఎస్ నాయకుల అరెస్టు.. కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్‌కు తరలింపు





గండిపేట(క్రైమ్ మిర్రర్): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మహిళా అసిస్టెంట్ ప్రొఫెసర్లపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న వైస్ ఛాన్సలర్ ఆల్దాస్ జానయ్యపై తక్షణమే చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బాధిత మహిళా ప్రొఫెసర్లకు న్యాయం చేయాలని కోరుతూ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్లు, విద్యార్థులు, విద్యార్థినులు నిరసన వ్యక్తం చేశారు. ఈ ఘటనతో వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిసరాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి విశ్వవిద్యాలయానికి వెళ్లి బాధిత మహిళా ప్రొఫెసర్లను పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పి అండగా నిలిచారు. మహిళా అధ్యాపకులపై వచ్చిన వేధింపుల ఆరోపణలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి సమగ్ర విచారణ జరిపించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళా ప్రొఫెసర్లను పరామర్శించేందుకు వెళ్లిన బీఆర్ఎస్ నేత పట్లోళ్ల కార్తీక్ రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ.. మహిళా ప్రొఫెసర్లపై వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న వీసీ ఆల్దాస్ జానయ్యపై చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం, ఆయనకు మద్దతుగా నిలుస్తోందని ఆరోపించారు. బాధిత మహిళలకు న్యాయం చేయకుండా ప్రభుత్వం ఎందుకు మౌనం వహిస్తోందని ప్రశ్నించారు. మహిళా ఉద్యోగులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. మరోవైపు అత్తాపూర్, రాజేంద్రనగర్ సర్కిల్ ఇన్‌చార్జి కొలన్ సుభాష్ రెడ్డి ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయానికి బయలుదేరిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు పలుచోట్ల అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. రాజేంద్రనగర్, గగన్‌పహాడ్, బుద్వేల్, ఆరాంఘర్, మైలార్‌దేవ్‌పల్లి, చాంద్రాయణగుట్ట తదితర ప్రాంతాల మీదుగా వారిని తరలించి చివరకు కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. అక్కడ సుమారు మూడు గంటల పాటు ఉంచినట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా కొలన్ సుభాష్ రెడ్డి మాట్లాడుతూ.. మహిళా ప్రొఫెసర్లపై వచ్చిన వేధింపుల ఆరోపణలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం, అందుకు బదులుగా బాధితులకు అండగా నిలుస్తున్న నాయకులను అరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు. వీసీపై చర్యలు తీసుకోకుండా ప్రభుత్వం కాపాడుతోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో బాధితులను పరామర్శించడం, వారికి న్యాయం చేయాలని కోరడం ప్రతి ఒక్కరికీ ఉన్న హక్కు అని పేర్కొన్నారు. అక్రమ అరెస్టులు సమస్యకు పరిష్కారం కాదని, మహిళా ప్రొఫెసర్లకు న్యాయం చేయడమే ప్రభుత్వ ప్రాధాన్యత కావాలని అన్నారు. ఈ వ్యవహారంపై నిష్పక్షపాత విచారణ జరిపించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో ధర్మారెడ్డి, డి. రమేష్ ముదిరాజ్,నోములరాము యాదవ్, కాటేదాన్ డివిజన్ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు గుమ్మడి కుమార్, హైదర్‌గూడ అధ్యక్షుడు నరేంద్ర రావు, ఉద్యమ నాయకుడు ఎడ్లకాడి సూర్యం, శీలం తిరుపతి రెడ్డి, సదాల వెంకట్ రెడ్డి, మైసి రెడ్డి, మైలార్ దేవ్ పల్లి డివిజన్ యువజన అధ్యక్షులు అక్కేం రఘు యాదవ్, బండ రాజేష్ యాదవ్, రామస్వామి, మోహన్, కార్మిక విభాగ అధ్యక్షులు ఉప్పల్ శ్రీను, సరికొండ దుర్గేష్, కొంపల్లి జగదీష్ నేత, నరేష్, శివ ముదిరాజ్, శ్రీవర్ధన్ రెడ్డి, సాయి, మధు, మహేష్ తదితర నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

రంగారెడ్డి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి

కలెక్టరేట్ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా



గండిపేట(క్రైమ్ మిర్రర్): రంగారెడ్డి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట సీపీఐ నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆండ్రోజు రవీంద్రాచారి, ముత్యాల యాదిరెడ్డి, పుస్తకాల నర్సింగరావు, పల్నాటి యాదయ్య, కే. రామకృష్ణ, ఓరుగంటి యాదయ్య, పైమా బేగం, శేఖర్ రెడ్డి, ప్రభులింగం, రామస్వామి తదితరులు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని జిల్లాను తక్షణమే కరువు జిల్లాగా ప్రకటించాలని కోరారు. వ్యవసాయంపై ఆధారపడిన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. నష్టపోయిన రైతులను గుర్తించి తక్షణమే ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఉపశమనం కలిగించేలా రేషన్ దుకాణాల ద్వారా ప్రస్తుతం అందిస్తున్న బియ్యానికి అదనంగా మరో 10 కిలోల బియ్యం పంపిణీ చేయాలని కోరారు. కరువు ప్రభావంతో జీవనోపాధి దెబ్బతిన్న కుటుంబాలకు ప్రభుత్వం ప్రత్యేక సహాయక చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కరువు పరిస్థితులపై సమగ్ర పరిశీలన జరిపి రైతులు, పేద ప్రజలకు అండగా నిలవాలని నాయకులు స్పష్టం చేశారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో నష్టాలను అంచనా వేసి బాధితులకు తగిన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి. శివకుమార్, ఆర్. యాదగిరి, కే. నర్సింహారెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు జె. ఆనంద్ గౌడ్, సీపీఐ రాజేంద్రనగర్ మండల సహాయ కార్యదర్శి జె. విజయానందం గౌడ్, జె. సదానందం గౌడ్, జి. సత్యం, ముబ్బీశ్వరు, గుజ్జరి శ్రీరాములు, కే. మధు, సాబేర్, శంషాబాద్ మండల కార్యదర్శి నర్ర గిరి, సాబేర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గొలుసుకట్టు చెరువులకు నీరు చేరేలా కాలువల మరమ్మతులు

గ్రామ సర్పంచ్ కాటం వెంకటేశం



చిట్యాల క్రైమ్ మిర్రర్: కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వర్షపు నీటిని ప్రతి చుక్కా ఒడిసిపట్టేలా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు గ్రామ సర్పంచ్ కాటం వెంకటేశం తెలిపారు. చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామంలో వి.బి. రాంజీ ఉపాధి పథకం కింద పెద్ద చెరువు అలుగు నుంచి వృథాగా పోతున్న నీరు దిగువన ఉన్న గొలుసుకట్టు చెరువులకు చేరేలా కాలువల మరమ్మతు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కరువు ముప్పును ఎదుర్కొనేందుకు ముందస్తు జాగ్రత్తలు అవసరమని, పాంప్లాంట్లు, ఇంకుడు గుంతలు, గొలుసుకట్టు కాలువల ద్వారా వర్షపు నీటిని సంరక్షించుకోవచ్చని పేర్కొన్నారు. నీటి వృథాను అరికట్టి భూగర్భ జలాల పెంపునకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, మర్రి హరీష్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కృష్ణయ్య, గంటల పుల్లారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ చేకూరి మల్లేష్, కారోబార్, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

చిరుమర్తి లింగయ్యపై వ్యక్తిగత విమర్శలు సహించేది లేదు

చిట్యాల బీఆర్ఎస్ నాయకులు డిమాండ్



చిట్యాల క్రైమ్ మిర్రర్: నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యపై కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు చేస్తున్న వ్యక్తిగత, అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, సంబంధిత నాయకులు బేషరతుగా క్షమాపణ చెప్పాలని చిట్యాల మున్సిపాలిటీకి చెందిన బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం చిట్యాలలోని ఎం.ఎన్. రెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాజకీయ విమర్శలు అభివృద్ధి, ప్రజా సమస్యలు, విధానాలకే పరిమితం కావాలని, వ్యక్తిగతంగా, కుటుంబ సభ్యులను కించపరిచేలా మాట్లాడటం సరికాదన్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీగా, రెండుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన చిరుమర్తి లింగయ్యపై ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన చిట్యాల ఒకటో వార్డు కౌన్సిలర్ నాగిళ్ల సుధాకర్ అలియాస్ కావేరి చేసిన వ్యాఖ్యలు హుందాతనానికి విరుద్ధమని పేర్కొన్నారు.

అభివృద్ధిపై సమాధానం చెప్పాలి

ప్రస్తుత ఎమ్మెల్యే వేముల వీరేశం నియోజకవర్గ అభివృద్ధిపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. చిట్యాల మున్సిపాలిటీలో పింఛన్లు, డబుల్ బెడ్‌రూం, ఇందిరమ్మ ఇళ్ల మంజూరుతో పాటు జాతీయ రహదారి పనులు, మౌలిక సదుపాయాల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని విమర్శించారు. ప్రజా సమస్యలను పక్కనపెట్టి వ్యక్తిగత విమర్శలకు ప్రాధాన్యమివ్వడం తగదన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే కేసులు, బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించిన బీఆర్ఎస్ నాయకులు, వాటికి భయపడేది లేదని స్పష్టం చేశారు. చిరుమర్తి లింగయ్యపై భవిష్యత్తులోనూ వ్యక్తిగత దూషణలకు దిగితే సహించబోమని హెచ్చరించారు. రాజకీయ కక్షలు పక్కనపెట్టి ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, నియోజకవర్గ అభివృద్ధిపై కాంగ్రెస్ నాయకులు దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ మెండే సైదులు మాజీ మున్సిపల్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి పదో వార్డ్ కౌన్సిలర్ నిమ్మడ గోటి శ్రీనివాస్ రెండో వార్డ్ కౌన్సిలర్ ఎస్కే షబానా అజీముద్దీన్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జమాన్ల శ్రీనివాస్ రెడ్డి బొబ్బిలి శివ శంకర్ రెడ్డి జిట్ట బొందయ్య ఆగు అశోక్ యాదవ్ పోకల రాములు పాల కిష్టయ్య ఆవుల ఆనంద్ బులుగూరి సైదుల్ తదితరులు పాల్గొన్నారు.

రామప్ప ఐలాండ్ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

టూరిజం నోడల్ అధికారి డా . ఎ. ధర్మ నాయక్

వెంకటాపూర్ (రామప్ప), క్రైమ్ మిర్రర్, నవంబర్ 10: రామప్ప సరస్సు ఐలాండ్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేయాలని టూరిజం నోడల్ అధికారి ధర్మ నాయక్ సూచించారు. మంగళవారం రామప్ప సరస్సు ఐలాండ్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. నిర్మాణాల పురోగతిని సమీక్షించి, పనుల నాణ్యతను తనిఖీ చేశారు. పెండింగ్ పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టూరిజం ఏఈ విజయ్, టూరిజం గైడ్ గోరంటల విజయ్ కుమార్, హరిత హోటల్ సిబ్బంది రాకేష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
8 బుధవారం 11-11-2026



జోగు దుర్గమ్మ మృతదేహానికి నివాళులర్పించిన సంజయ్ దాస్ గౌడ్

చిట్యాల క్రైమ్ మిర్రర్: నల్గొండ జిల్లా చిట్యాల మండలం తాళ్లవెల్లంల గ్రామంలో తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జోగు లింగస్వామి మాతృమూర్తి జోగు దుర్గమ్మ మృతిచెందగా, సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, తెలంగాణ ఉద్యమ నేత కూనూరు సంజయ్ దాస్ గౌడ్ ఆమె పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లింగస్వామి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. తల్లిని కోల్పోవడం తీరని లోటని, కష్టకాలంలో సంఘం ఎల్లప్పుడూ కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంద వేణుగోపాల్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కొసనం అశోక్ యాదవ్, జిట్టా మల్లేష్, బత్తుల నాగరాజు గౌడ్, సంఘం నాయకులు, ఉద్యమకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చిన్నజీయర్ స్వామివారిని మర్యాదపూర్వకంగా కలిసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు



గండిపేట(క్రైమ్ మిర్రర్): శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామివారిని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ ఎన్. రామచంద్రరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్వామివారి ఆశీస్సులు తీసుకుని కొద్దిసేపు ఆత్మీయంగా ముచ్చటించారు. ఈ భేటీలో రామచంద్రరావుతో పాటు బీజేపీ మెదక్ జిల్లా ఇన్‌చార్జి బొక్క నర్సింహారెడ్డి, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి బైతి శ్రీధర్, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి వడ్డే చంద్రయ్య, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులందరూ చిన్నజీయర్ స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. స్వామివారితో జరిగిన ఈ ఆత్మీయ సమావేశం ఆధ్యాత్మిక వాతావరణంలో సాదరంగా సాగింది. ఈ భేటీ సందర్భంగా నాయకులు తమ గౌరవాభిమానాలను చాటుకున్నారు.

36 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీకి సేవలందిస్తున్న సానెం శ్రీనివాస్ గౌడ్‌కు నామినేటెడ్ పదవి కల్పించాలి

రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు విజ్ఞప్తి

పార్టీ పటిష్ఠతకు నిరంతరం కృషి చేసిన సీనియర్ నాయకుడికి సముచిత గుర్తింపు ఇవ్వాలి: మహమ్మద్ ఖాదర్



గండిపేట్‌క్రైమ్ మిర్రర్: కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి, బలోపేతం కోసం గత 36 సంవత్సరాలుగా అంకితభావంతో పనిచేస్తున్న సీనియర్ నాయకుడు సానెం శ్రీనివాస్ గౌడ్‌కు తగిన నామినేటెడ్ పదవి కల్పించాలని కాంగ్రెస్ అధిష్ఠానానికి మహమ్మద్ ఖాదర్ విజ్ఞప్తి చేశారు. రంగారెడ్డి జిల్లా, రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజల తరఫున ఆయన సేవలను గుర్తించి సముచిత గౌరవం కల్పించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనారిటీ విభాగం మాజీ కార్యదర్శి మహమ్మద్ ఖాదర్ పార్టీ అగ్రనేతలకు వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకు ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు విజ్ఞప్తి చేశారు. సానెం శ్రీనివాస్ గౌడ్ గత 36 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో నిబద్ధత, నిజాయితీ, అంకితభావంతో పనిచేస్తున్నారని మహమ్మద్ ఖాదర్ తన విజ్ఞప్తిలో పేర్కొన్నారు. పార్టీ కష్టకాలంలోనూ కార్యకర్తగా, నాయకుడిగా పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటూ రాజేంద్రనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండాను గర్వంగా నిలబెట్టేందుకు నిరంతరం కృషి చేశారని తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం తన జీవితంలో ఎంతో సమయాన్ని వెచ్చిస్తూ, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అహర్నిశలు శ్రమించారని పేర్కొన్నారు. పార్టీ పట్ల ఆయనకున్న విధేయత, ప్రజాసేవ పట్ల ఉన్న నిబద్ధతను అధిష్ఠానం గుర్తించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. పార్టీ కోసం దశాబ్దాలుగా పనిచేస్తున్న సీనియర్ నాయకులకు తగిన ప్రాధాన్యత, గుర్తింపు కల్పించడం ద్వారా పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం పెరుగుతుందని మహమ్మద్ ఖాదర్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సానెం శ్రీనివాస్ గౌడ్‌కు ఆయన అనుభవం, సేవలకు తగిన విధంగా ఒక నామినేటెడ్ పదవి కేటాయించాలని కాంగ్రెస్ అధిష్ఠానాన్ని కోరారు. రంగారెడ్డి జిల్లా ప్రజలు, రాజేంద్రనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణుల తరఫున ఈ విజ్ఞప్తి చేస్తున్నామని, 36 సంవత్సరాల సుదీర్ఘ పార్టీ సేవలకు సముచిత గుర్తింపు లభించేలా పార్టీ పెద్దలు సానుకూలంగా స్పందించాలని మహమ్మద్ ఖాదర్ కోరారు.

ఓటర్ల జాబితా ప్రక్షాళనపై రాజకీయ పార్టీలతో సమావేశం

రాజేంద్రనగర్‌లో ఎస్ఐఆర్ వెరిఫికేషన్‌పై సమీక్ష



గండిపేట(క్రైమ్ మిర్రర్): రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, ధృవీకరణ ప్రక్రియపై ఎన్నికల అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈఆర్ఓ, జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఓటర్ల జాబితా పరిశీలన, వివరాల ధృవీకరణ, తప్పుల సవరణ తదితర కీలక అంశాలపై చర్చించారు. ఈ సమావేశానికి బీజేపీ తరఫున నారగూడెం మల్లారెడ్డి, కే. రవీందర్ రెడ్డి, ధనుంజయ్ తదితరులు హాజరయ్యారు. అలాగే అత్తాపూర్ డిప్యూటీ కమిషనర్ మల్లయ్య, శంషాబాద్ డిప్యూటీ కమిషనర్ సుమన్ రావు, అరవింద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలో ఓటర్ల జాబితాను సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరంపై అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు చర్చించారు. ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో ధృవీకరించడం, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండేలా చూడటం, జాబితాలో నమోదైన తప్పులు, చిరునామా మార్పులు, ఇతర వివరాల్లోని లోపాలను గుర్తించి సరిచేయడం వంటి అంశాలపై సమీక్షించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్ల వివరాల సేకరణ, ధృవీకరణ పారదర్శకంగా జరగాలని, అర్హులైన ఓటర్లు ఎవరూ జాబితా నుంచి అన్యాయంగా తొలగించబడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సమావేశంలో సూచించారు. అదేవిధంగా అనర్హమైన, తప్పుగా నమోదైన వివరాలను ఎన్నికల నిబంధనల ప్రకారం పరిశీలించి సరిదిద్దాలని చర్చించారు. ఓటర్ల జాబితా స్వచ్ఛత ప్రజాస్వామ్య వ్యవస్థకు అత్యంత కీలకమని, ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించేలా ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని సమావేశంలో అభిప్రాయపడ్డారు. ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా చురుకుగా భాగస్వాములై, ఓటర్లకు అవసరమైన అవగాహన కల్పించాలని సూచించారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు అందేలా సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, పారదర్శకమైన ఎన్నికల నిర్వహణే లక్ష్యంగా ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలని అధికారులు సూచించారు.

మహిళా ప్రొఫెసర్లకు న్యాయం చేయాలి

వీసీ ఆల్దాస్ జానయ్యపై చర్యలు తీసుకోవాలి




గండిపేట(క్రైమ్ మిర్రర్): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మహిళా అసిస్టెంట్ ప్రొఫెసర్లపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న వైస్ ఛాన్సలర్ ఆల్దాస్ జానయ్యపై తక్షణమే చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బాధిత మహిళా ప్రొఫెసర్లకు న్యాయం చేయాలని కోరుతూ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్లు, విద్యార్థులు, విద్యార్థినులు నిరసన వ్యక్తం చేశారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి విశ్వవిద్యాలయానికి వెళ్లి బాధిత మహిళా ప్రొఫెసర్లను పరామర్శించారు. వారికి అండగా నిలుస్తూ, మహిళా అధ్యాపకులపై వచ్చిన వేధింపుల ఆరోపణలపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరోవైపు బాధిత మహిళా ప్రొఫెసర్లను పరామర్శించేందుకు వెళ్లిన బీఆర్ఎస్ నాయకుడు పట్లోళ్ల కార్తీక్ రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ.. మహిళా ప్రొఫెసర్లపై వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న వీసీపై చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం, ఆయనకు మద్దతుగా నిలుస్తోందని ఆరోపించారు. బాధితులకు న్యాయం చేయాల్సిన ప్రభుత్వం ఈ వ్యవహారంలో ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. మహిళా అధ్యాపకులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అత్తాపూర్, రాజేంద్రనగర్ సర్కిల్ ఇన్‌చార్జి కొలన్ సుభాష్ రెడ్డి ఆధ్వర్యంలో బయలుదేరిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకున్నారు. రాజేంద్రనగర్, గగన్‌పహాడ్, బుద్వేల్, ఆరాంఘర్, మైలార్‌దేవ్‌పల్లి, చాంద్రాయణగుట్ట తదితర ప్రాంతాల మీదుగా వారిని తరలించి చివరకు కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. అక్కడ సుమారు మూడు గంటల పాటు ఉంచినట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా కొలన్ సుభాష్ రెడ్డి మాట్లాడుతూ.. మహిళా ప్రొఫెసర్లపై వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న వీసీపై చర్యలు తీసుకోకుండా ప్రభుత్వం ఎందుకు వెనకడుగు వేస్తోందని ప్రశ్నించారు. బాధిత మహిళలకు న్యాయం చేయాలని కోరడం తప్పా? ప్రజాస్వామ్యంలో బాధితులను పరామర్శించే హక్కు కూడా లేదా? అని నిలదీశారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాలను అణచివేయలేరని, తమకు కావాల్సింది అరెస్టులు కాదని, బాధిత మహిళా ప్రొఫెసర్లకు న్యాయమని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై నిష్పక్షపాత విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో సీనియర్ నాయకులు డి. రమేష్ ముదిరాజ్, నోముల రాము యాదవ్, మైసి రెడ్డి, కాటేదాన్ డివిజన్ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు గుమ్మడి కుమార్, హైదర్‌గూడ అధ్యక్షుడు నరేంద్ర రావు, ఏ. సూర్యం, శేలం తిరుపతి రెడ్డి, సదాల వెంకట్ రెడ్డి, యువజన అధ్యక్షుడు అక్కేం రఘు యాదవ్, బండ రాజేష్ యాదవ్, కొంపల్లి జగదీష్ నేత, నరేష్, శ్రీవర్ధన్ రెడ్డి, సాయి, మధు, మహేష్ తదితర నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

విద్యార్థుల భవిష్యత్తు కోసం ఎన్ని నిధులైన వెచ్చిస్తాం:ఎంపీ వంశీకృష్ణ

మంత్రి వివేక్ చొరవతో నియోజకవర్గ విద్యా రంగానికి రూ.10 కోట్ల నిధులు

సోమనపల్లిలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా పాఠశాల

జైపూర్‌లో 320 మంది విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగుల పంపిణీ





మంచిర్యాల నవంబర్ 10 (క్రైమ్ మిర్రర్): విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం అవసరమైన నిధులు సమకూర్చేందుకు సిద్ధంగా ఉందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. మంచిర్యాల జిల్లా జైపూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విశాఖ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 320 మంది విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు.అనంతరం విద్యార్థులతో కలిసి ఎంపీ మధ్యాహ్న భోజనం చేశారు. వారితో ముచ్చటించి చదువు, పాఠశాలలోని సదుపాయాలు, భవిష్యత్తు లక్ష్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెన్నూరు నియోజకవర్గంలో విద్యా రంగం అభివృద్ధికి రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి చొరవతో రూ.10 కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు. సోమనపల్లి గ్రామంలో సుమారు రూ.200 కోట్లతో యంగ్ ఇండియా సమీకృత పాఠశాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ పాఠశాల అందుబాటులోకి వస్తే చెన్నూరు ప్రాంత విద్యార్థులకు మెరుగైన వసతులతో నాణ్యమైన విద్య అందుతుందన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరిచి పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. విద్యా వ్యవస్థలో మార్పులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాధాన్యమిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, విశాఖ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బాధిత మహిళా ప్రొఫెసర్‌కు తెలంగాణ రక్షణ సేన సంఘీభావం





గండిపేట(క్రైమ్ మిర్రర్): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మహిళా అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎదుర్కొన్నారంటూ వెలుగులోకి వచ్చిన వేధింపుల ఆరోపణలపై తెలంగాణ రక్షణ సేన పార్టీ నాయకులు స్పందించారు. బాధిత మహిళా ప్రొఫెసర్‌కు సంఘీభావం ప్రకటిస్తూ ఆమెకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. తెలంగాణ రక్షణ సేన పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సంఘీభావ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పడాల మనోజ, రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి నీరుడు సర్వేష్ ముదిరాజ్, పార్టీ నాయకురాలు ఇంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పడాల మనోజ మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన విశ్వవిద్యాలయంలోనే మహిళా ఉద్యోగులకు వేధింపులు ఎదురవుతున్నాయనే ఆరోపణలు రావడం అత్యంత బాధాకరమని అన్నారు. ఒక మహిళ తనకు జరిగిన అన్యాయాన్ని ధైర్యంగా బయటపెట్టి ఫిర్యాదు చేయడానికి ముందుకు వచ్చినప్పుడు, ఆమెకు అండగా నిలబడాల్సిన బాధ్యత సమాజంతో పాటు ప్రభుత్వంపై కూడా ఉందని పేర్కొన్నారు. మహిళా ప్రొఫెసర్ చేసిన ఆరోపణలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి నిష్పక్షపాతంగా, పారదర్శకంగా విచారణ జరిపించాలని పడాల మనోజ డిమాండ్ చేశారు. ఫిర్యాదు చేసిన బాధితురాలిపై ఎలాంటి ఒత్తిడి తీసుకురాకుండా ఆమెకు తగిన రక్షణ కల్పించాలని కోరారు. ఈ వ్యవహారాన్ని తెలంగాణ మహిళా కమిషన్ విచారణకు స్వీకరించి వైస్ ఛాన్సలర్‌కు నోటీసులు జారీ చేయడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. విచారణలో వాస్తవాలు వెలుగులోకి తీసుకువచ్చి, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పదవులు ఎంత పెద్దవైనా ఎవరూ చట్టానికి అతీతులు కారని, మహిళల గౌరవం కంటే ఏ పదవీ గొప్పది కాదని పడాల మనోజ స్పష్టం చేశారు. మహిళలకు ఎక్కడ అన్యాయం జరిగినా వారి పక్షాన నిలబడి న్యాయం కోసం పోరాడుతామని తెలిపారు. మల్కాజిగిరి నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలిగా మహిళల హక్కుల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రక్షణ సేన నాయకులు మాట్లాడుతూ బాధిత మహిళా ప్రొఫెసర్‌కు న్యాయం జరిగేలా ప్రభుత్వం, సంబంధిత అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. మహిళల భద్రత, గౌరవం విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. బాధితురాలికి న్యాయం జరిగే వరకు తమ సంఘీభావం కొనసాగుతుందని తెలిపారు.

మహిళా అసిస్టెంట్ ప్రొఫెసర్లకు న్యాయం చేయాలి

వీసీని వెంటనే సస్పెండ్ చేసి సమగ్ర విచారణ జరిపించాలి



గండిపేట(క్రైమ్ మిర్రర్): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మహిళా అసిస్టెంట్ ప్రొఫెసర్లపై వైస్ ఛాన్సలర్ (వీసీ) వేధింపులకు పాల్పడుతున్నారంటూ వస్తున్న ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఈ వ్యవహారంపై వాస్తవాలను తెలుసుకునేందుకు బయలుదేరిన బీఆర్ఎస్ పార్టీ నాయకులను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేయడం రాజకీయంగా కలకలం రేపింది. విశ్వవిద్యాలయంలో మహిళా అసిస్టెంట్ ప్రొఫెసర్లపై వీసీ వేధింపులకు పాల్పడుతున్నారనే ఆరోపణల నేపథ్యంలో వాస్తవ పరిస్థితులను తెలుసుకోవడంతో పాటు బాధిత మహిళా అధ్యాపకులకు అండగా నిలిచేందుకు బీఆర్ఎస్ నాయకులు ప్రయత్నించారు. అయితే, వారు విశ్వవిద్యాలయానికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. మహిళా అధ్యాపకులపై వేధింపులకు పాల్పడుతున్నారనే ఆరోపణలు అత్యంత తీవ్రమైనవని, ఈ వ్యవహారాన్ని ప్రభుత్వం తేలిగ్గా తీసుకోవద్దని డిమాండ్ చేశారు. విద్యాబుద్ధులు నేర్పే ఉన్నత విద్యాసంస్థలో మహిళా ఉద్యోగులే వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న పరిస్థితి ఆందోళనకరమని పేర్కొన్నారు. వీసీపై వచ్చిన ఆరోపణలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆయన్ను పదవి నుంచి సస్పెండ్ చేయాలని, నిష్పక్షపాతంగా సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. విచారణలో వాస్తవాలు వెలుగులోకి తీసుకువచ్చి, బాధిత మహిళా అసిస్టెంట్ ప్రొఫెసర్లకు న్యాయం చేయాలని కోరారు. మహిళా ఉద్యోగులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. ఈ అరెస్టయిన వారిలో శీలం తిరుపతి రెడ్డి, సుభన్ రెడ్డి, కాటన్ డివిజన్ అధ్యక్షులు ఎస్. వెంకటేష్, మైలార్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షులు గుమ్మడి కుమార్, డి. రమేష్ ముదిరాజ్, సూర్యం, చిట్టి నరేందర్, రాజేష్ యాదవ్, వాసు నరేష్, శేఖర్ తదితరులు ఉన్నారు.

బదిలీ వివాదం.. ఆరోపణలపై వీసీ జానయ్య డీజీపీకి ఫిర్యాదు

మహిళా అధ్యాపకురాలి ఆరోపణలను ఖండించిన వీసీ..

డిజిటల్ ఆధారాలతో సమగ్ర విచారణ జరపాలని విజ్ఞప్తి

గండిపేట(క్రైమ్ మిర్రర్): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం లో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్యపై మహిళా అధ్యాపకురాలు చేసిన ఆరోపణల వ్యవహారం మరో మలుపు తిరిగింది. తనపై వచ్చిన ఆరోపణలను ఖండించిన వీసీ ప్రొఫెసర్ జానయ్య.. ఈ వ్యవహారంపై నిష్పాక్షికంగా సమగ్ర దర్యాప్తు జరిపి వాస్తవాలను వెలికితీయాలని కోరుతూ రాష్ట్ర డీజీపీకి అధికారికంగా ఫిర్యాదు చేశారు. తన ప్రతిష్ఠకు భంగం కలిగించేలా కొందరు ఉద్దేశపూర్వకంగా వ్యవహరిస్తున్నారని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. విశ్వవిద్యాలయంలో గత రెండేళ్లుగా చేపడుతున్న పరిపాలనా సంస్కరణలు, వ్యవస్థాగత మార్పులు, బదిలీల నేపథ్యంలో ఈ వివాదం తలెత్తిందని వీసీ తన వాదనను వినిపించారు. పరిపాలనా అవసరాల మేరకు చేపట్టిన సాధారణ బదిలీని కొందరు వ్యక్తులు వివాదాస్పదం చేస్తూ తనపై ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. అయితే ఈ వ్యవహారంలో మహిళా అధ్యాపకురాలు చేసిన ఆరోపణల నిజానిజాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. నిజామాబాద్ జిల్లా రూరూర్‌లోని కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో సుమారు 12 ఏళ్లుగా పనిచేస్తున్న ఓ మహిళా అధ్యాపకురాలిని పరిపాలనా సర్దుబాట్లలో భాగంగా హైదరాబాద్‌కు బదిలీ చేస్తూ 2026 సెప్టెంబర్ 11న ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బదిలీ నిబంధనల ప్రకారమే సాధారణ గ్రూప్ బదిలీగా చేపట్టినట్లు ఆయన వివరించారు. అయితే ఈ బదిలీ నేపథ్యంలోనే తనపై ఆరోపణలు తెరపైకి వచ్చాయని వీసీ అభిప్రాయపడ్డారు. విశ్వవిద్యాలయంలో రైతులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా సంస్థను తీర్చిదిద్దేందుకు సంస్కరణలు చేపడుతున్నామని, వాటిని అడ్డుకునేందుకు కొందరు అసంతృప్త వ్యక్తులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. నవంబర్ 7న సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మహిళా అధ్యాపకురాలు చేసిన వ్యాఖ్యలు తనకు తీవ్ర మనస్తాపం కలిగించాయని ప్రొఫెసర్ జానయ్య పేర్కొన్నట్లు ఫిర్యాదులో వెల్లడించారు. ఆమె చేసిన ఆరోపణలు నిరాధారమైనవని, తన వ్యక్తిగత ప్రతిష్ఠతో పాటు వైస్ ఛాన్సలర్ పదవి గౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ మధ్య తనకు వేధింపులు ఎదురయ్యాయని మహిళా అధ్యాపకురాలు ఆరోపిస్తున్నప్పటికీ, ఆ సమయంలో ఫిర్యాదు చేయకుండా చాలా కాలం తర్వాత ఈ విషయాన్ని బహిరంగంగా ప్రస్తావించడంపై వీసీ సందేహాలు వ్యక్తం చేశారు. ఈ పరిణామాల వెనుక బదిలీ వివాదం లేదా ఇతరుల ప్రేరణ ఉందా అనే కోణంలోనూ విచారణ జరగాలని కోరారు. అయితే ఫిర్యాదు చేయడంలో జాప్యం జరిగిందనే అంశం ఒక్కటే ఆరోపణల నిజానిజాలను నిర్ణయించలేదనే విషయాన్ని కూడా దర్యాప్తులో పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంది. ఉపాధ్యాయుడిగా, పరిశోధకుడిగా, పరిపాలకుడిగా సుమారు 35 ఏళ్లుగా పనిచేస్తున్నానని, ఈ సుదీర్ఘ వృత్తి జీవితంలో మహిళా సహోద్యోగుల గౌరవానికి భంగం కలిగించేలా ఎప్పుడూ ప్రవర్తించలేదని ప్రొఫెసర్ జానయ్య పేర్కొన్నారు. తనపై వచ్చిన ఆరోపణలతో వ్యక్తిగతంగా, వృత్తిపరంగా తీవ్ర ఆవేదనకు గురయ్యానని వెల్లడించారు. వాస్తవాలు వెలుగులోకి రావాలంటే సమగ్ర విచారణ ఒక్కటే మార్గమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ వివాదంపై డీజీపీకి సమర్పించిన ఫిర్యాదులో ప్రొఫెసర్ జానయ్య పలు అంశాలను ప్రస్తావించారు. గత కొన్ని నెలలుగా తనకు, సంబంధిత మహిళా అధ్యాపకురాలికి మధ్య జరిగిన వాట్సాప్ సంభాషణలు, ఫోన్ కాల్ హిస్టరీలు, ఇతర డిజిటల్ ఆధారాలను పూర్తిస్థాయిలో పరిశీలించాలని కోరారు. ఆరోపణలకు సంబంధించిన ప్రతి అంశాన్ని నిష్పాక్షికంగా ధృవీకరించి వాస్తవాలను వెలికితీయాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా ఈ వ్యవహారం వెనుక మరెవరైనా ఉన్నారా? ఆరోపణలకు ఎవరైనా ప్రేరేపించారా? అనే అంశాలపైనా విచారణ జరపాలని కోరినట్లు తెలిపారు. తనపై వచ్చిన ఆరోపణలు నిజమా కాదా అన్నది చట్టపరమైన విచారణ ద్వారా తేలాలని, దోషులు ఎవరైనా ఉంటే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. పీజేటీఎస్ఏయూలో చోటుచేసుకున్న ఈ పరిణామాలు విద్యావర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఒకవైపు మహిళా అధ్యాపకురాలు చేసిన ఆరోపణలు, మరోవైపు వాటిని ఖండిస్తూ వీసీ డీజీపీకి ఫిర్యాదు చేయడం ఈ వివాదాన్ని మరింత ప్రాధాన్యంగా మార్చాయి. ఆరోపణలపై ముందస్తు నిర్ణయాలకు తావులేకుండా, మహిళా అధ్యాపకురాలి వాదనతో పాటు వీసీ సమర్పించిన ఆధారాలను కూడా పరిశీలించి నిష్పాక్షిక విచారణ చేపట్టాల్సిన అవసరం ఉంది.

ఆశ వర్కర్ల వేతన పెంపుపై ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సానుకూల స్పందన



గండిపేట(క్రైమ్ మిర్రర్): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాజేంద్రనగర్ నియోజకవర్గానికి చెందిన ఆశ వర్కర్లు స్థానిక ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆశ వర్కర్ల నెలసరి వేతనాన్ని రూ.18 వేలకు పెంచుతూ తక్షణమే ఉత్తర్వులు జారీ చేసి అమలు చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్లు మాట్లాడుతూ.. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సేవలు అందించడంలో ఆశ కార్యకర్తలు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. గర్భిణులకు ఆరోగ్య సూచనలు అందించడం, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ, టీకాల కార్యక్రమాలు, కుటుంబ నియంత్రణ, ప్రభుత్వ ఆరోగ్య పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం వంటి అనేక బాధ్యతలను నిరంతరం నిర్వహిస్తున్నామని వివరించారు. విధి నిర్వహణలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ, తమకు రావాల్సిన వేతన పెంపు హామీ మాత్రం ఇప్పటికీ అమలుకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ఆశ వర్కర్ల వేతనాన్ని రూ.18 వేలకు పెంచుతామని ప్రకటించిన విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఇచ్చిన హామీని అమలు చేసి తమ కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఆశ వర్కర్ల సమస్యలను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శ్రద్ధగా ఆలకించారు. వారి విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందిస్తూ, వేతన పెంపు అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సంబంధిత శాఖ మంత్రుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఆశ వర్కర్లకు న్యాయం జరిగేలా తన వంతు పూర్తి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజారోగ్య పరిరక్షణలో ఆశ వర్కర్ల సేవలు ఎంతో కీలకమని, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆశ వర్కర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



రాజేంద్రనగర్‌లో రూ.2.37 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

గండిపేట(క్రైమ్ మిర్రర్): రాజేంద్రనగర్ నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు మెరుగైన తాగునీరు, మురుగునీటి పారుదల సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ తెలిపారు. ఇందులో భాగంగా రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ (జలమండలి) ఆధ్వర్యంలో సుమారు రూ.2 కోట్ల 37 లక్షల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బండ్లగూడ వార్డు గోల్డెన్ హైట్స్ కాలనీలో నూతన వాటర్ పైప్‌లైన్ నిర్మాణ పనులకు, బుద్వేల్ ప్రాంతంలోని బక్క డాక్టర్ గల్లీలో సీవరేజ్ పైప్‌లైన్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఆయా ప్రాంతాల్లో చాలాకాలంగా ఎదురవుతున్న తాగునీరు, మురుగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రతి కాలనీ, ప్రతి వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా నూతన పైప్‌లైన్ల నిర్మాణం, మురుగునీటి పారుదలకు అవసరమైన సీవరేజ్ వ్యవస్థను మెరుగుపరచడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వెల్లడించారు. గోల్డెన్ హైట్స్ కాలనీలో వాటర్ పైప్‌లైన్ నిర్మాణం పూర్తయితే తాగునీటి సరఫరా మరింత మెరుగుపడుతుందని, బుద్వేల్ బక్క డాక్టర్ గల్లీలో సీవరేజ్ పైప్‌లైన్ పనులు పూర్తయితే మురుగునీటి సమస్యలకు ఉపశమనం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ అధికారులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీలకు చెందిన స్థానికులు పాల్గొన్నారు.



బుద్వేల్, డైరీ ఫారంలో అభివృద్ధి పనులకు శ్రీకారం

పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్

గండిపేట(క్రైమ్ మిర్రర్): రాజేంద్రనగర్ నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని బుద్వేల్, డైరీ ఫారం ప్రాంతాల్లో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. ప్రారంభించిన పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత సమయంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, వాటర్ బోర్డు అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా వాసిరెడ్డి నరేష్ నియామకం




గండిపేట(క్రైమ్ మిర్రర్): తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా 127--మణికొండ డివిజన్‌కు చెందిన వాసిరెడ్డి నరేష్ నియమితులయ్యారు. తనకు కీలక బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వాసిరెడ్డి నరేష్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్, మీడియా అండ్ పబ్లిసిటీ కమిటీ చైర్మన్, భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అధికార ప్రతినిధిగా తన నియామకాన్ని కేవలం పదవిగా కాకుండా, పార్టీ తనపై ఉంచిన నమ్మకానికి ప్రతీకగా, ప్రజలకు సేవ చేసే గొప్ప బాధ్యతగా భావిస్తున్నానని నరేష్ పేర్కొన్నారు. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వ విధానాలు, ప్రజా సంక్షేమ నిర్ణయాలు ప్రతి ఒక్కరికీ చేరేలా నిరంతరం పనిచేస్తానని, అదే సమయంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తానని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం, తెలంగాణ అభివృద్ధి లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పూర్తి నిబద్ధతతో పనిచేస్తానని వాసిరెడ్డి నరేష్ తెలిపారు. పార్టీ బలోపేతానికి, ప్రజా ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రచారానికి తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని వెల్లడించారు. తనపై విశ్వాసం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి మరోసారి కృతజ్ఞతలు తెలియజేస్తూ, అప్పగించిన బాధ్యతను అంకితభావంతో నిర్వహిస్తానని ఆయన పేర్కొన్నారు.

ఎండిపోయిన వరి పంటలకు ఎకరాకు రూ.40 వేల పరిహారం ఇవ్వాలి

మెదక్ జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలి

ఫసల్ బీమా పథకాన్ని అమలు చేయాలి

జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన తెలంగాణ రైతు రక్షణ సమితి



నర్సాపూర్, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి నవంబర్ 10: మెదక్ జిల్లాలో ఎండిపోయిన వరి పంటలకు ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు నష్టపరిహారం అందించాలని తెలంగాణ రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు అక్కమొల్ల మైసయ్య యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని కోరారు. మంగళవారం తెలంగాణ రైతు రక్షణ సమితి మెదక్ జిల్లా అధ్యక్షుడు అక్కమొల్ల మైసయ్య యాదవ్ అధ్యక్షతన జిల్లా కార్యవర్గ కమిటీ సభ్యులు సమావేశమై జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఎండిపోయిన వరి పంటలను, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించారు. అనంతరం రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మైసయ్య యాదవ్ మాట్లాడుతూ.. మెదక్ జిల్లాలో మొత్తం 21 మండలాలు ఉండగా, కేవలం మనోహరాబాద్ మండలాన్ని మాత్రమే కరువు మండలంగా ప్రకటించడం వల్ల మిగతా 20 మండలాల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని మండలాల్లో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వ పరిహారం, సబ్సిడీలు అందాలంటే జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని కోరారు. ఫసల్ బీమా పథకాన్ని అమలు చేయాలి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు భరోసా కల్పించేలా ఫసల్ బీమా పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. యాసంగి సీజన్‌లో వరి పంటకు బదులుగా ఇతర ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా రైతులకు ప్రభుత్వం సబ్సిడీలు అందించాలని సూచించారు. ప్రతి గ్రామ పంచాయతీలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించి రైతులకు పంటల మార్పిడిపై అవగాహన కల్పించాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు.జిల్లాలో ఎండిపోయిన వరి పంటలకు తక్షణమే నష్టపరిహారం అందించి రైతులను ఆదుకోవాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు మైసయ్య యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మిరియాల చంద్రశేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బోయిని రమేష్ యాదవ్, ముఖ్య సలహాదారు కొండ ఎల్లం యాదవ్, జిల్లా కార్యదర్శి నరేందర్, జిల్లా కార్యవర్గ సభ్యులు పరశురాం యాదవ్, పి. మల్లేష్, సిద్ధిరాములు యాదవ్, యేసయ్య, వంశీకృష్ణ తదితర రైతు నాయకులు పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
10 బుధవారం 11-11-2026

ధాన్యం క్వింటాల్‌కు రూ.4 వేల ధర చెల్లించాలి

రైతులకు నష్టం కలగకుండా మిల్లర్లు కొనుగోలు చేయాలి: వస్కుల మట్టయ్య



మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, నవంబర్ 10: రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని, క్వింటాల్‌కు రూ.4 వేల ధర తగ్గకుండా రైస్ మిల్లర్లు కొనుగోలు చేయాలని ఎంసీపీఐయూ కేంద్ర కమిటీ సభ్యుడు, ఆలిండియా కిసాన్ సభ నాయకుడు వస్కుల మట్టయ్య డిమాండ్ చేశారు.మంగళవారం మిర్యాలగూడలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని పలువురు రైస్ మిల్లర్లు ధాన్యం ధరలను తగ్గించి కొనుగోలు చేస్తున్నారంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. రైతులు, మిల్లర్లు ఇరువర్గాలకు నష్టం కలగకుండా క్వింటాల్‌కు రూ.4 వేల ధర తగ్గకుండా ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు.ఓవైపు ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు, మరోవైపు సాగునీటి ఇబ్బందులతో రైతులు అధిక పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇన్ని కష్టనష్టాలకు ఓర్చి పండించిన ధాన్యానికి సరైన ధర లభించకపోతే రైతులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర అందేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు.ఈ సమావేశంలో ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి వస్కుల సైదమ్మ, సహాయ కార్యదర్శి పోతుగంటి కాశి, నాయకులు మోహన్ నాయక్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అవకాశవాద రాజకీయాలు బీసీలు గమనించాలి.

ముఖ్యమంత్రి మెప్పు కోసమే పిసిసి వ్యాఖ్యలు..

బిజెపి రాష్ట్ర నాయకులు మర్రిపెల్లి సత్యమ్ .



జగిత్యాల జిల్లా బ్యూరో (క్రైమ్ మిర్రర్): తెలంగాణలో ఎన్నికలు ఎప్పుడు జరిగినా కాంగ్రెస్ పార్టీ 100 సీట్లు గెలిచి అధికారంలోకి వస్తుందని అప్పుడు బీసీనే ముఖ్యమంత్రి అవుతాడని అని ప్రకటించిన పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నిన్న వికారాబాద్ జిల్లాలో జరిగిన సదస్సులో మల్లి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని రేవంత్ రెడ్డియే ముఖ్యమంత్రి అభ్యర్థి అని చేసిన వ్యాఖ్యలు దొంగది కాదు దొడ్లెకు రాదు అన్న చందంగా ఉన్నాయని బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మర్రిపెల్లి సత్యమ్ ఎద్దేవా చేశారు.గతంలో సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణలో పరిపాలన చేయడానికి బీసీలకు చేతకాదని వెలమలు లేదా రెడ్డిలే పరిపాలించాలని చేసిన వ్యాఖ్యలకు పిసిసి అధ్యక్షుడి వ్యాఖ్యలు మద్దతు పలికినట్టుగా ఉన్నాయని ఈ విషయాన్ని తెలంగాణలోని 56% ఉన్న బీసీలు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న మోసపూరిత వాగ్దానాలను గమనించాలని అన్నారు.కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మరెక్కడ లేవని మహేష్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ కాంగ్రెస్ ఇచ్చిన హామీలు మరెక్కడ ఇవ్వలేదని అమలు కాని హామీలు ఇచ్చి అడ్డదారిలో అధికారంలోకి వచ్చామని చెప్తే బాగుండేదని అన్నారు. ఆహార భద్రత పథకంలో భాగంగా ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన పథకం కింద కేంద్ర ప్రభుత్వం దేశంలోని ఎనభై అయిదు కోట్ల 50 లక్షల మందికి ఉచిత బియ్యం పంపిణీ చేస్తున్నదని అందులో భాగంగా తెలంగాణలో ఉన్న ప్రతి ఒక్కరికి ఇస్తున్న ఐదు కిలోల చొప్పున సన్నబియ్యానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఒక కిలో బియ్యం కలిపి ఇచ్చి మొత్తం తామే ఇస్తున్నామని చెప్పుకోవడం మందికి పుట్టిన పిల్లలను చూసి మన పిల్లలని సంబరపడ్డట్టు ఉందన్నారు. తెలంగాణ రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయలేదని మూడు పంటలకు రైతు భరోసా ఎగ్గొట్టినారని గత రెండు సంవత్సరాల నుండి రైతు బీమా ఇవ్వకుండా రైతుల దగ్గర కొనుగోలు చేసిన ఖరీఫ్ పంటకు చెందిన వరి ధాన్యానికి ఇవ్వాల్సిన బోనస్ డబ్బులు రబి పంట కోతకు వచ్చిన ఇవ్వకుండా అన్ని ఇచ్చినట్టు చెప్పుకోవడం సిగ్గుచేటని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారంలోకి రావడానికి ఇచ్చిన ఆరు గ్యారెంటీలు 420 హామీలు అమలు చేయకుండా ప్రజల దృష్టిలో 420 గా మిగిలిపోయిందని అన్నారు. 500 రూపాయలకు గ్యాస్ కనెక్షన్ ఇవ్వకుండా రాష్ట్ర ప్రజలకు ఇచ్చినట్టు కాంగ్రెస్ పార్టీ గ్యాస్ కొడుతుందని విమర్శించారు.. ఈ సమావేశంలో వెలగటూర్ బిజెపి మండల అధ్యక్షులు గోపతి జనార్ధన్ సీనియర్ నాయకులు సంగ వెంకటగిరి దశముఖి శివన్న మండల ఇంచార్జ్ పారిపెల్లి జీవన్ రావు తదితరులు పాల్గొన్నారు

ఘనంగా సదర్ ఉత్సవాలు..

యాదవ సోదరులతో కలిసి వేడుకల్లో పాల్గొన్న తోకల శ్రీనివాస్ రెడ్డి





గండిపేటక్రైమ్ మిర్రర్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే యాదవుల సదర్ ఉత్సవాలు రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. జీహెచ్ఎంసీ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్ డివిజన్లతో పాటు హైదర్‌షాకోట్ ప్రాంతాల్లో యాదవ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు, రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్సవాల కోసం ప్రత్యేకంగా అలంకరించిన దున్నపోతులను ఆయన ఆసక్తిగా తిలకించారు. యాదవ సోదరులతో కలిసి ఉత్సవాల్లో పాల్గొని సందడి చేశారు. సదర్ వేడుకల సందర్భంగా యాదవ సంఘం ప్రతినిధులు, స్థానికులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. దీపావళి అనంతరం యాదవ సామాజిక వర్గం అత్యంత వైభవంగా జరుపుకునే సదర్ పండుగకు ప్రత్యేకమైన చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యత ఉంది. పశుసంపదపై యాదవులకు ఉన్న అనుబంధం, పశు పోషణలో వారి కృషి, సామాజిక ఐక్యత, ఆత్మగౌరవం, వారసత్వ సంప్రదాయాలకు ఈ ఉత్సవాలు అద్దం పడతాయి. ఈ వేడుకల్లో భాగంగా దున్నపోతులను రంగురంగుల వస్త్రాలు, పూలమాలలు, ప్రత్యేక ఆభరణాలతో అందంగా అలంకరించి ప్రదర్శించడం ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది. వాటి బలప్రదర్శనలు, నృత్యాలు, డోలు వాయిద్యాలు, యువత ఉత్సాహం, యాదవ సోదరుల కోలాహలం పండుగకు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చాయి. కుటుంబ సభ్యులు, చిన్నారులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను ఆస్వాదించారు. ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. సదర్ ఉత్సవాలు కేవలం ఒక పండుగ మాత్రమే కాదని, తరతరాలుగా కొనసాగుతున్న మన సంస్కృతి, సంప్రదాయాలు, సామాజిక ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. యాదవ సోదరులు తమ పశుపోషణ సంప్రదాయాలను, పూర్వీకుల వారసత్వాన్ని గర్వంగా కొనసాగించడం అభినందనీయమన్నారు. ఇలాంటి పండుగలు సమాజంలోని అన్ని వర్గాల మధ్య ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. అనంతరం యాదవ సోదరులకు సదర్ ఉత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, యాదవ సంఘం ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, యువకులు, పెద్దలు, మహిళలు, పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొని సదర్ ఉత్సవాలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.

వీసీ జానయ్యకు వ్యతిరేకంగా నిరసనకు వెళ్తుండగా బీఆర్ఎస్ నాయకుల అరెస్ట్

గండిపేటక్రైమ్ మిర్రర్: మహిళా ప్రొఫెసర్‌పై లైంగిక వేధింపులకు పాల్పడ్డారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న వీసీ జానయ్యకు వ్యతిరేకంగా నిరసన తెలిపేందుకు బయలుదేరిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్ట్ చేయడం రాజేంద్రనగర్‌లో రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. బాధిత మహిళా ప్రొఫెసర్‌కు న్యాయం చేయాలని, వీసీ జానయ్యపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు సిద్ధమైన నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ అరెస్టులపై బీఆర్ఎస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పోరెడ్డి ధర్మారెడ్డి మాట్లాడుతూ.. అక్రమ అరెస్టులతో తమ పోరాటాన్ని అణచివేయలేరని, బాధితురాలికి న్యాయం జరిగే వరకు ప్రజాస్వామ్య పద్ధతిలో తమ నిరసన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. బాధిత ప్రొఫెసర్‌కు మద్దతుగా శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళుతున్న తమను అడ్డుకోవడం, పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని విమర్శించారు. మహిళకు న్యాయం



చేయాల్సిన ప్రభుత్వం, ఆమెకు మద్దతుగా నిలుస్తున్న వారిని అరెస్ట్ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. మహిళా ప్రొఫెసర్‌పై వేధింపులకు పాల్పడ్డారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న వీసీ జానయ్యకు వ్యతిరేకంగా నిరసన తెలిపేందుకు, బాధితురాలికి అండగా నిలిచేందుకు తాము బయలుదేరామని తెలిపారు. అయితే పోలీసులు తమను అక్రమంగా అరెస్ట్ చేసి రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌లో కూర్చోబెట్టడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికీ ఉందని, ఆ హక్కును అడ్డుకోవడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. పోలీసులను అడ్డుపెట్టుకుని తమ గొంతును నొక్కాలని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. బాధిత మహిళకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఆరోపణలు ఎదుర్కొంటున్న వీసీపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అరెస్టులతో తమ ఉద్యమాన్ని ఆపలేరని, మహిళలకు అన్యాయం జరిగినప్పుడు చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు. బాధిత మహిళా ప్రొఫెసర్‌కు న్యాయం జరిగే వరకు, వీసీ జానయ్యపై చట్టపరమైన చర్యలు తీసుకునే వరకు తమ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు పోరెడ్డి ధర్మారెడ్డి, ఎర్రోళ్ల యాదయ్య, సరికొండ దుర్గేష్, ఈ. నవీన్ కుమార్, కట్టెల మండి గౌతమ్, అఖీరా నందన్ తదితరులు ఉన్నారు.

గ్రామాభివృద్ధికి సమన్వయమే కీలకం: ఎమ్మెల్యే కాలే యాదయ్య

శంకర్‌పల్లి మండల సమీక్షా సమావేశంలో అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలపై చర్చ



క్రైమ్ మిర్రర్ శంకర్‌పల్లి: రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గంలోని శంకర్‌పల్లి మండల ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన మండల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని గ్రామాల్లో గతంలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై ఎమ్మెల్యే సమీక్షించారు. సర్పంచుల ద్వారా క్షేత్రస్థాయి వివరాలను తెలుసుకుని, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రాబోయే రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో నీటి కొరత, విద్యుత్ సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున ప్రజలు ఇప్పటి నుంచే నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవాలని కోరారు. మండలంలోని గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు దాదాపు పూర్తయ్యాయని, మిగిలిన పనులను విడతల వారీగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

రైతులకు రుణ సదుపాయాలపై పీఏసీఎస్ చైర్మన్ వెల్లడి

పీఏసీఎస్ చైర్మన్ బొల్లారం వెంకటరెడ్డి మాట్లాడుతూ.. రైతులకు తక్కువ వడ్డీకే గోల్డ్ లోన్లు, ఇతర రుణాలు అందిస్తున్నామని తెలిపారు. రైతుల సౌకర్యార్థం లాకర్ సదుపాయం కూడా అందుబాటులో ఉందని, రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అధికారులు ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకోవాలి: సురేందర్ గౌడ్

శంకర్‌పల్లి మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు, పర్వేద సర్పంచ్ సురేందర్ గౌడ్ మాట్లాడుతూ.. అధికారులు ప్రజాప్రతినిధులతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సర్పంచుల సూచనలను పట్టించుకోకుండా వ్యవహరిస్తే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ముఖ్యంగా ఇరిగేషన్, అంగన్‌వాడీ శాఖల అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు.

సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఈ సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గోవిందమ్మ, గోపాల్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బొల్లారం వెంకటరెడ్డి, మొకిల పీఏసీఎస్ చైర్మన్ గౌంద్ర సత్యం, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, శంకర్‌పల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మడపతి చంద్రమౌళి, పర్వేద సర్పంచ్ సురేందర్ గౌడ్, పిల్లిగుండ్ల సర్పంచ్ స్వాతి కాంత్ రెడ్డి, సంకేపల్లి గోపాల్, సంకేపల్లి సర్పంచ్ శ్రీనివాస్, అంతప్పగూడ సర్పంచ్ బీరయ్య, చందిప్ప సర్పంచ్ మల్లికార్జున్, మొకిల సర్పంచ్ శేఖర్, గోపులారం సర్పంచ్ రవీందర్ రెడ్డి, కొత్తపల్లి సర్పంచ్ బలవంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే శంకర్‌పల్లి తహసీల్దార్ సురేందర్, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్‌తో పాటు వ్యవసాయ, ఉద్యానవన, పట్టు పరిశ్రమ, పశుసంవర్ధక, ప్రాథమిక విద్య, వైద్య ఆరోగ్య, స్త్రీ శిశు సంక్షేమ, విద్యుత్, గ్రామీణ మంచినీటి సరఫరా, రెవెన్యూ, పౌరసంఘాలు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, రోడ్లు భవనాలు, ఉపాధి హామీ, ఇరిగేషన్, అటవీ, సాంఘిక సంక్షేమ, వెనుకబడిన తరగతుల సంక్షేమ, ఇందిరమ్మ ఇళ్ల హౌసింగ్ తదితర శాఖల అధికారులు, అన్ని గ్రామాల సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా కృషి చేయాలనే దిశగా ఈ సమావేశం కొనసాగింది.

రైతు కష్టానికి ధర నిర్ణయించేది వ్యాపారులా?

రైతులకు అండగా నిలవని ప్రజాప్రతినిధులు, అధికారులు రైతుల కష్టాన్ని దోచుకుంటే తిరుగుబాటు తప్పదు: బీసీ యువజన సంఘం నేత తిరుమలగిరి అశోక్



మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, నవంబర్ 10: ఆరుగాలం శ్రమించి పంట పండించిన రైతుకు తన ఉత్పత్తికి ధర నిర్ణయించుకునే అవకాశం లేకుండా పోతోందని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల కష్టాన్ని వ్యాపారులు దోచుకుంటున్నా ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. రైతులకు న్యాయం జరగకపోతే వారి ఆగ్రహం తిరుగుబాటుగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు.మంగళవారం మిర్యాలగూడలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు యూరియా, ఎరువులు, పురుగుమందులను రైతులు కొనుగోలు చేస్తున్నారని, మరి రైతులు పండించిన ధాన్యానికి ధరను రైస్ మిల్లర్లు ఎలా నిర్ణయిస్తారని ప్రశ్నించారు. రైతుల వద్ద క్వింటాల్ ధాన్యాన్ని రూ.3 వేల నుంచి రూ.3,200కే కొనుగోలు చేస్తూ, అదే ధాన్యాన్ని సామాన్య వినియోగదారులకు రూ.7,200 వరకు విక్రయిస్తూ రైతులను, ప్రజలను దోచుకుంటున్నారని ఆరోపించారు.రైతుల శ్రమను దోచుకుంటున్న వ్యాపారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వ్యాపారులు రైతులను మోసం చేస్తున్నా ప్రశ్నించాల్సిన ప్రతిపక్షాలు మౌనం వహించడం ఏమిటని నిలదీశారు. రైతుల ఓట్ల కోసం వచ్చే రాజకీయ పార్టీలు, నాయకులు వారి సమస్యల పరిష్కారానికి ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. రైతులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు ప్రతిపక్షాలపైనా ఉందన్నారు.రైతుల సమస్యలపై ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలని, ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలని అశోక్ కోరారు.ఈ కార్యక్రమంలో దాసరాజు జయరాజు, నాయిని భాస్కర్, పట్టేటి రమేష్, బోయిన ఉపేందర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.